RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 152 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి మంగళవారం 2-6-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు,జ్యేష్ఠ మాసం, తిథి॥ విదియ సా॥4.52,మూల రా॥8.31, వర్జ్యం సా॥6.45 - 8.31,
దుర్ముహూర్తం ఉ॥ 8.03-8.55, శుభ సమయం మ॥ 12.00-1.30, రాహుకాలం మ॥3.00-4.30, సూర్యోదయం ఉ॥ 5.28, సూర్యాస్తమయం సా॥ 6.27 గం॥

## రాష్ట్రంలో అలజడుల సృష్టికి వైసిపి కుట్రలు

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



**నంద్యాల, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైసీపీ దుష్ట రాజకీయాలకు పాల్పడుతుందని ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి మిగతా 2లో..

# ఎన్డీఏ కూటమి వరుస విజయాలు సాధించాలి

అందుకు ప్రతి కార్యకర్తా కృషి చేయాలి: తునిలో టీడీపీ కార్యకర్తలతో సీఎం చంద్రబాబు



**కాకినాడ, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎన్డీఏ కూటమి వరుస విజయాలు సాధించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. 'పార్టీయే సుప్రీం.. కార్యకర్తే నాయకుడు' అనే సిద్ధాంతంతో ప్రతి ఒక్కరూ పార్టీ సైనికుడిగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాల ప్రయోజనాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. తునిలో టీడీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశర చేశారు. ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి ఉచిత విద్యుత్ అందించడం ద్వారా కరెంటు బిల్లుల భారాన్ని తగ్గిస్తామని సీఎం తెలిపారు. అలాగే రైతులకు ఉచిత వ్యవసాయ పంపుసెట్లు, యూనివర్సల్ హెల్త్ స్కీమ్ కింద రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్యం వంటి పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. గ్రామ, క్లస్టర్ స్థాయి సమావేశాల్లో మహిళల భాగస్వామ్యాన్ని భారీగా పెంచాలని పేర్కొన్నారు. పార్టీని నమ్ముకుని పనిచేసే కార్యకర్తలను ఆర్థికంగా ఎదిగేలా చేయడం తమ నైతిక బాధ్యత అని చంద్రబాబు చెప్పారు. జూన్ 21న రాష్ట్రవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, అనంతరం జూన్ 25 నుంచి నాయకులు, కార్యకర్తలు పర్యావరణ హితంగా సైకిళ్లపై ఇంటింటి ప్రచారం చేపట్టాలని సూచించారు. గత ఎన్నికల్లో సాధించిన 55.5 శాతం ఓట్ల కంటే మరింత ఎక్కువ ప్రజా మద్దతు సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మన డిక్షనరీలో ఓటమి అనే మాట ఉండకూడదని.. ప్రతి కార్యకర్త ఏకపక్షంగా గెలుపు సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. తుని నియోజకవర్గం చామవరంలో పేదల సేవలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ దివ్యాంగ యువకుడిని ఆప్యాయంగా పలకరించారు. సీఎం స్వయంగా అతని దగ్గరకు వెళ్లి భుజంపై చేయి వేసి ఫోటో దిగడంతో ఆ దివ్యాంగ యువకుడు సంతోషంతో ఉప్పొంగిపోయాడు. యువకుడి తల్లిదండ్రులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతూ, 'మీరంటే మా కుమారుడికి ఎంతో అభిమానం' అని తెలిపారు.

వెంటనే కాకినాడ జిల్లా కలెక్టర్‌ను పిలిచిన సీఎం.. ప్రభుత్వం తరఫున దివ్యాంగ యువకుడికి అన్ని సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. అనంతరం ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. తూర్పు గోదావరి జిల్లాలో వ్యవసాయం, ఉద్యానవన శాఖల ద్వారా సాగుతున్న వివిధ పంటల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు మైక్రో న్యూట్రియెంట్స్‌తో పాటు ప్రకృతి సేద్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు దిశా నిర్దేశర చేశారు.

## రైల్వేజోన్ రాకతో ఉత్తరాంధ్రకు మహర్దశ

- ఇఛ్ఛాపురం సంబరాల్లో కేంద్రమంత్రి రామ్మోహన్




**శ్రీకాకుళం, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక.. రైల్వే జోన్ సాకారమైందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎన్నో పోరాటాల ఫలితమే దక్షిణ కోస్తా రైల్వే అని తెలిపారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుపై ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద నిర్వహించిన సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త జోన్ ఏర్పాటుతో లక్షలమంది ప్రయాణి కులకు లబ్ది చేకూరుతుందన్నారు. రైల్వేను అభివృద్ధి చేస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతోనే కృషి చేసినట్లు చెప్పారు. 'రైల్వే జోన్ కోసం పార్లమెంట్‌లో నిరంతరం మాట్లాడా. ఇచ్ఛాపురం బ్రిడ్జి సమస్యకు కూటమి ప్రభుత్వంలోనే పరిష్కారం లభిస్తుంది. బ్రిడ్జి మాత్రమే కాకుండా అండర్ బ్రిడ్జిపైనా దృష్టి సారిస్తాం. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌ను రూ.12 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. ఇచ్ఛాపురం అంటే మూలన ఉండేది కాదు.. ముఖ ద్వారం కాబోతోంది. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు ఉత్తరాంధ్ర ప్రజల తరఫున ధన్యవాదాలు అని మిగతా 2లో..

## జేబుదొంగలతో జాగ్రత్త

- రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ జూన్ 1 (ఆర్ఎన్ఏ):** సీబీఎస్ఈ కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియలో లోపాలపై దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై కేంద్రం, సీబీఎస్ఈని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి టార్గెట్ చేశారు. మూల్యాంకన ప్రక్రియలో చేసిన తప్పుల నుంచి సీబీఎస్ఈ లాభపడుతోందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన విద్యార్థులతో ముచ్చటించిన వీడియోను సోమవారం ఎక్స్ వేదికగా షేర్ చేశారు. "జేబుదొంగలు ఉన్నారు జాగ్రత్త. వారు సీబీఎస్ఈ కార్యాలయంలో తిష్ట వేశారు. సీబీఎస్ఈ పొరపాటు వల్ల మార్కులు తప్పుగా వస్తే.. దానికి మీకు బిల్లు పడుతుంది. అదెలాగంటే..

- డిజిటల్ స్కాన్ కాపీ తీసుకోవాలంటే ఒక సబ్జెక్ట్‌కు రూ.100
- ఒక పేపర్ రీటోటలింగ్‌కు రూ.100
- రి-ఎవాల్యుయేషన్ మిగతా 2లో..

## ముఖ్యమంత్రిగా కాదు ..సేవకుడిగా ఉంటా

- తమిళనాడు సీఎం విజయ్




**చెన్నై, జూన్ 1 (ఆర్ఎన్ఏ):** తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ మొదటిసారి బహిరంగ ర్యాలీలో పాల్గొన్నారు. తిరుచ్చిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో తన పార్టీని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాకుండా ప్రజల సేవకుడిగా పని చేస్తానన్నారు. భవిష్యత్తులో జరగబోయే అన్ని ఎన్నికల్లోనూ ప్రజల మద్దతు లభిస్తుందని దృఢంగా నమ్ముతున్నానని అన్నారు. ఎన్నికల్లో తన విజయాన్ని దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్ విజయంతో పోలుస్తున్నారని విజయ్ పేర్కొన్నారు. కానీ తాను అంత గొప్ప నేతతో పోల్చుకోవట్లేదని.. ఎంజీఆర్, అన్నా, పెరియార్ చూపిన మార్గంలో పని చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. రాష్ట్ర హక్కులు, లౌకికవాదం విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదన్నారు. డీఎంకే-అన్నాడీఎంకేపై విజయ్ విమర్శలు గుప్పించారు. ఆరు నెలలపాటు మౌనంగా ఉంటామని చెప్పినవారు.. ఆరు రోజులు కూడా మౌనంగా ఉండలేకపోయారని అసహనం వ్యక్తం చేశారు. కుటుంబ రాజకీయాల వల్లే డీఎంకే ఎన్నికల్లో ఓటమి చవిచూసిందన్నారు. ఇన్నేళ్లుగా వంతులవారీగా మోసం చేస్తున్న రెండు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. అయినప్పటికీ తన ప్రభుత్వాన్ని కూలదోసి అధికారం చేపట్టాలని ఆ పార్టీల నేతలు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. తమిళనాడు రాజకీయాల్లో ఇప్పటికీ ఎప్పటికీ పోటీ డీఎంకే-టీవీకే మధ్యే ఉంటుందన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి విజయ్ బ్లాక్ అండ్ వైట్ సూట్‌లోనే మిగతా 2లో..

## పెన్షన్ల కోసం రూ.65,886.57 కోట్లు విడుదల

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

సత్యవరంలో పెన్షన్లు పంపిణీ చేసిన హోంమంత్రి అనిత



**విజయనగరం/అనకాపల్లి, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కొనసాగుతోంది. విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గం గంట్యాడ మండలం గింజేరులో కూటమి నాయకులతో కలిసి మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మిగతా 2లో..


## జూన్ 7 నుంచి 21 వరకు యోగా కార్యక్రమాలు

- రెండున్నర లక్షల మందిని భాగస్వాములను చేస్తాం
- వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి



**అమరావతి, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీలో జూన్ 7 నుంచి 21 వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ సారి 2.5 లక్షల మందిని యోగా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో సర్టిఫైడ్ యోగా సాధకులను తయారు చేయాలని, వెస్టర్న్ బైపాస్‌లో 25 వేల మందితో యోగా కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. పొదుపు చర్యల్లో భాగంగా 30 రోజుల నుంచి 15 రోజులకు కుదించినట్లు తెలిపారు. జూన్ 21న ప్రధాన యోగా కార్యక్రమం వెస్టర్న్ బైపాస్ రోడ్డుపై నిర్వహించాలనే దానిపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో పోలీసులు, బీఆర్ అంబేద్కర్ కోనసీమలో రైతులు, కృష్ణా జిల్లాలో లారీ ఓనర్ల అసోషియేషన్ ద్వారా యోగా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ఏడాది రెండున్నర లక్షల మందిని భాగస్వామ్యం చేయాలని సీఎం చంద్రబాబు కోరినట్లు తెలిపారు. వెస్టర్న్ బైపాస్‌లో 25 వేల మందితో యోగా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. 2020-25 వరకు మెంటల్ హెల్త్ విషయంలో సగటున మిగతా 2లో..

## రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు నోటిఫికేషన్



**న్యూఢిల్లీ జూన్ 1 (ఆర్ఎన్ఏ):** ఏపీ సహా 10 రాష్ట్రాల్లోని రాజ్యసభ స్థానాలకు, మూడు రాష్ట్రాల శాసన మండలి స్థానాలకు ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. జూన్ 18న ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ స్థానాలతో పాటు పదవీకాలం ముగియకుండానే ఖాళీయైన మూడుస్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో మొత్తం 27 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ మిగతా 2లో..

## మేలో రికార్డు స్థాయిలో తిరుమలకు భక్తులు

శ్రీవారిని దర్శించుకున్న 25,46,168 మంది భక్తులు

రూ.120.28 కోట్ల ఆదాయం సమకూర్చినట్లు టిటిడి వెల్లడి



**తిరుమల, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమ లలో మే నెలలో రికార్డు స్థాయిలో భక్తులు కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ యేడాది ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. మే మాసంలో రికార్డు స్థాయిలో తిరుమల శ్రీవారిని భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు కావడం, విద్యా సంస్థలకు విరామం రావడంతో దేశవిదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టీటీడీ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది మే నెలలో తిరుమలలో రికార్డు స్థాయి దర్శనాలు, కానుకలు, తలనీలాలను భక్తులు సమర్పించారు. మే మాసంలో తిరుమల శ్రీవారిని 25,46,168 మంది భక్తులు దర్శించుకున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే వేసవిలో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది మే నెలలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, స్వామివారిపై ఉన్న భక్తి శ్రద్ధలతో భక్తులు భారీగా తిరుమలకు తరలి వచ్చారు. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సర్వదర్శనం మిగతా 2లో..

## వైఎస్ విగ్రహ ధ్వంసం గొడ్డలి పార్టీ కుట్ర

- ఆపార్టీ కార్యకర్తతో చేయించి, కూటమిపై నెట్టే యత్నం
- నంద్యాల ఘటనపై మంత్రి అనగాని ఘాటు విమర్శలు



**అమరావతి, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నంద్యాలలో వైఎస్ విగ్రహం విధ్వంసం ఘటనపై మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. నంద్యాలలో వైఎస్ విగ్రహం తలకాయను గొడ్డలి పార్టీ కార్యకర్త జంబులయ్యతో తీయించి.. దాన్ని టీడీపీ మీద నెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జంబులయ్య భార్యకు మెప్మాలో గత ప్రభుత్వంలో ఉద్యోగం ఇచ్చారని... మిగతా 2లో..

శరీరాన్ని గురించి మనమెంత తక్కువగా ఆలోచిస్తే అంత మంచిది. ఎందుకంటే, మనలను కిందికి దిగలాగేది ఈ శరీరమే. సంగత్వం, దేహాత్మభ్రాంతి - ఇవే మన దు:ఖాలకు కారణం.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# తెలంగాణ మేధావులు ఆలోచించాలి !

తెలంగాణ ఆవిర్భావంపై మేధావులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఆవిర్భావం తరవాత తెలంగాణ లక్ష్యాలను సాధించిందా అన్నది లెక్కలు వేయాలి. ఉమ్మడి ఎపిలో ఉన్న పరిస్థితులకన్నా ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా సాధించిన పురోగతి అంటూ ఏమీ లేదు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న ట్యాగ్ లైన్ కట్టుతప్పింది. నీళ్లు లేవు. నిధులు, నియామకాలు మాత్రం పాలక పార్టీలకు చేరాయి. మృత్యువు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ తెచ్చానన్న కెసిఆర్ కుటుంబం బాగుపడింది. ఆయనను నమ్ముకుని నడిచిన వారు బాగుపడ్డారు. తరవాత కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఇప్పుడు, ఆ పార్టీ నేతలు బాగు పడ్డారు. వారిలో కొందరికి పదవులు వచ్చాయి. కానీ కోరుకున్న తెలంగాణ మాత్రం సాకారం కాలేదు. ప్రొఫెసర్ కోదండరామ్ లాంటి వారు మౌనం దాల్చారు. ఆయన ఓ ఎమ్మెల్సీ పదవితో పెదవి విప్పడం లేదు. ఇప్పుడు మేధావులు మరోమారు గళం విప్పాల్సిన సమయమిది. ఎందుకంటే జనం కోరుకుని త్యాగాలు చేస్తే, రాజకీయ నాయకులు అధికారం అనుభవిస్తున్నారు. పదవులు చేపట్టారు. అంతే తప్ప మరోటి కాదన్నది నగ్న సత్యం. అన్నింటికి మించి తెలంగాణ అప్పులపాలయ్యింది. లక్షల కోట్లు అప్పులు చేసి సాధించింది శూన్యం. రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు మాత్రమే బాగుపడ్డారు. అప్పులు తీర్చే మార్గం కనపడడం లేదు. సంక్షేమం పేరిట చేస్తున్న కిలో రూపాయి బియ్యం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్, ఉచిత కరెంట్ మాత్రమే అభివృద్ధి కాదు. దీంతో అభివృద్ధి చేశామని చెప్పుకుంటే సరిపోదు. సంక్షేమ హాస్టళ్లు దినదినగండంగా సాగుతున్నాయి. విద్య, వైద్య రంగంలో అభివృద్ధి జరగడం లేదు. ప్రవైటు విద్యారంగం, వైద్యరంగం మాఫియాలా తయారయ్యింది. ఇవన్నీ పెద్ద సమస్యలే. వీటిని పరిష్కరించడం లేదు. అటు ఎపి కూడా అప్పుల్లో కూరుకు పోయింది. అమరావతి నిర్మాణం ప్రహసనంఆ సాగుతోంది. పోలవరం అంచనాలు పెంచుకుంటూ దోచుకుంటున్నారు. తెలంగాణలో కాలేశ్వరం లాంటి భారీ ప్రాజెక్ట్ చేపట్టి దోపిడీకి గురి చేశారు. భూములు మాయం అవుతున్నాయి. ఇసుక మాఫియా, మట్టి మాఫియా, గ్రనూట్ మాఫియాలు చెలరేగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెద్దగా అభివృద్ధి పనులు చేయలేక పోతోంది. నిష్పాక్షికంగా గమనిస్తే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు అనేకం ఉన్నాయి. ముందుగా ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులు లంచం ముట్టనిదే ఫైలు కదల్చడం లేదు. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనను ప్రజలు చూశారు. అప్పుడు అధికారం అంతా ఆయన చుట్టూనే కేంద్రీకృతం అయి ఉండేది. ప్రభుత్వం అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే ప్రభుత్వం అన్న అభిప్రాయం ప్రచారం చేశారు. అభివృద్ధి పేరుతో నయవంచన చేశారు. చెరువుల బాగుపడకున్నా, ఇంటింటికీ నల్లారాకున్నా ఊదరగొట్టారు. కాళేశ్వరం పేరుతో లక్ష ఎకరాలని నమ్మించారు. ఇవన్నీ ఎత్తి చూపి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి కూడా పెద్దగా ప్రభావం చూపట్టలేకపోతున్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ఆర్భాటం చేస్తున్నారు. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. ఇది ప్రజల చేతుల్లో ఉన్న నిర్ణయం. తెలంగాణలో గణనీయమైన మార్పు చేఇస, ప్రల జీవితాలు మర్చగలిగిన నాడే ప్రజలు మరోమారు అధికారం కోసం ఆలోచిస్తారు. వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్న రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగా తెలంగాన ప్రజల జీవితాల్లో ఏ మార్పు తీసుకుని వచ్చారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇప్పటికీ మంత్రి పదవుల కోసం చాలామంది వెంపర్లాడుతున్నారు. ప్రస్తుతానికి కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి ఒక్కరే బయటపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఇప్పటికే రెండున్నరేళ్లు గడుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ పురోగతికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తామని ప్రకటించలేదు. కొత్తగా ఉద్యోగాల కల్పనకు గట్టి చర్యలు తీసుకోవాలి. సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు పెద్ద ఎత్తు చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోళ్ల ప్రహసనం లేకుండా చేయగలగాలి. ఉద్యమకారులకు న్యాయం చేస్తామని చెప్పినా ఇప్పటికీ అతీగతీ లేదు. ఇప్పుడు కేశవరావు కమిటీ ఏం చేస్తుందో చూడాలి. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా చూసుకోవాలంటే అనేక పనులు చేయాల్సి ఉంది. ఇప్పటికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం ప్రచారం అవుతోంది. రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఇచ్చిన హామీలు, అమలు చేస్తున్నామా లేదా అన్నది చూడాలి. మరోవైపు కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ అంగీకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా సాగుతోంది. ఇవన్నీ అధిగమించి తెలంగాణ అభివృద్ధికి నడుం బిగిస్తే రేవంత్ రెడ్డి చరిత్రలో నిలుస్తారు. లేకుంటే అందరిలాగే ఆయన చరిత్రా మట్టిలో కలుస్తుంది. ఇవన్ఈన గమనించి కూడా మేధావి వర్గం మౌనంగా ఉంటోంది. వీటిపై గళం ఎత్తాలి. తెలంగాణ పునర్నిర్మాణం కోసం ముందుకు రావాలి. లేకుంటే మళ్లీ దగపడుతుందని గుర్తించాలి.

## మొదటి పేజీ తరువాయి

### రాష్ట్రంలో అలజడుల సృష్టికి వైసిపి కుట్రలు

బీసీ జనార్దన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో అలజడులు సృష్టించి, శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకు ఆ పార్టీ నేతలు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. వైసీపీ నేతల ఉచ్చులో పడకుండా మరింత అప్రమత్తంగా ఉండాలంటూ కూటమిలోని పార్టీ నేతలతోపాటు కార్యకర్తలకు ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లా సంజామల మండలం ముదిగేడులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహంపై దాడి చేసింది.. వైసీపీ కార్యకర్త జంబులయ్య అని వివరించారు. తాము వైసీపీ మద్దతుదారులమంటూ జంబులయ్య భార్య బాలమ్మ వీడియో రిలీజ్ చేసిందని తెలిపారు. తమకు స్థానిక వైసీపీ కార్పొరేటర్ శేషయ్య ఉద్యోగం ఇప్పించారని కూడా ఆమె చెప్పిందని పేర్కొన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే ఈ కుట్రలో తెలుగుదేశం పార్టీని ఇరికించే ప్రయత్నం వైసీపీ చేసిందని ఆ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 1995లో చంద్రబాబు సీఎం అయినప్పటి నుంచి ఫ్యాక్షనిజంపై ఉక్కుపాదం మోపారని గుర్తు చేశారు. ప్రశాంతంగా ఉన్న ప్లలెలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ వైసీపీ నేతలపై నిప్పులు చెరిగారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిన గొడ్డలి పార్టీ నాయకుడు, నేతలకు తమ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు.

### జేబుదొంగలతో జాగ్రత్త

చేయించుకోవాలంటే ఒక ప్రశ్నకు రూ.25 మొత్తంగా ఒక విద్యార్థి తన జవాబుపత్రాన్ని సరిగా దిద్దించుకోవడానికి దాదాపు రూ.2000 చెల్లించాల్సి రావొచ్చు. 4 లక్షల మంది విద్యార్థులు దీనికోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు.. జదీూజు ఎంత సొమ్ము ఆర్జిస్తోందో గమనించాలి. ఫోన్‌తో స్కాన్ చేస్తే.. తప్పులు రావడం ఖాయం. వాటిని సరిచేయడానికి అయ్యే ఖర్చు విద్యార్థులే చెల్లించాలి. తప్పు సీబీఎస్‌ఈది.. శిక్ష పడుతున్నది విద్యార్థులకు.. ఆదాయమేమో ప్రభుత్వానికి..! విద్య ఒక వ్యాపారంగా మారితే.. తప్పులు సరికాకపోగా రెట్టింపు అవుతాయి. సమయం, ఆత్మవిశ్వాసం, భవిష్యత్తు రూపంలో విద్యార్థులు మూల్యం చెల్లించుకుంటున్నారు" అని రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. సీబీఎస్‌ఈ టెండర్ నిబంధనలను మార్చేసిన ఫలితమే ఇదీ అని రాహుల్ ఇప్పటికే వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వాస్తవానికి 300 డీపీఐతో ఆటోమేటిక్ రోబోటిక్ స్కానర్లను పరీక్ష పత్రాల స్కానింగ్‌కు వినియోగించాల్సి ఉండగా.. ఆన్సర్ షీట్లను మొబైల్ ఫోన్ సాయంతో స్కాన్ చేసి తప్పిదాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థులు బాధితులుగా మారారని ఆందోళన వ్యక్తంచేశారు. పరీక్షల నిర్వహణలో యంత్రాంగం వైఫల్యం.. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలవరపరుస్తోంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన మరవకముందే... కొద్ది రోజులుగా సీబీఎస్‌ఈ 12వ తరగతి ఫలితాల వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది.

### రైల్వేజోన్ రాకతో ఉత్తరాంధ్రకు మహర్దశ

రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖ జోన్ కోసం పార్లమెంట్‌లో అనేక పర్యాయాలు పోరాడానని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. రైల్వే జోన్ సాధన కోసం ఆ రోజుల్లో ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో దీక్ష చేపట్టినట్లు గుర్తుచేశారు. నేడు కేంద్ర మంత్రిగా ఉండి దక్షిణ కోస్తా రైల్వే జోన్ సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నేటి నుంచి విశాఖపట్నం నుంచి పరిపాలన ప్రారంభమైందన్నారు. 'కొత్త రైల్వేజోన్ ద్వారా ఇక నుంచి మన సమస్యలను మనం తీర్చుకోగలం' అని తెలిపారు. ఇచ్ఛాపురం మండలం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతం ఏ.ఎస్ పేట వద్ద సౌత్ కోస్ట్ రైల్వేజోన్ స్వాగత బోర్డును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ అశోక్ సోమవారం ఆవిష్కరించారు. కొబ్బరికాయ కొట్టి, జోన్ ప్రారంభోత్సవానికి గుర్తుగా మొక్కను నాటారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ.. 'గతంలో స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు కృషి చేశారు. 12 సంవత్సరాలుగా నా భుజాలపైన సమస్యను వేసుకొని పోరాడి రైల్వే జోన్‌ను సాధించా' అని చెప్పారు. ఈ సరికొత్త రైల్వే జోన్ ప్రారంభం నేపథ్యంలో తెలుగు ప్రజలకు, ఆంధ్ర రాష్ట్రానికి, శ్రీకాకుళం జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే బలమైన లీడర్ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు శ్రీకాకుళం జిల్లా ప్రజల తరఫున కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు.

### పెన్షన్ల కోసం రూ.65,886.57 కోట్లు విడుదల

62,34,445 మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. జూన్ నెలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు రూ.2728 కోట్లు ప్రభుత్వం విడుదల చేసినట్లు చెప్పారు. కొత్తగా జూన్ నుంచి 5606 స్పౌజ్ పెన్షన్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. ఈ లబ్దిదారులకు ప్రత్యేకంగా రూ.2.24 కోట్లు విడుదల చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు పెన్షన్ల కోసం రికార్డు స్థాయిలో రూ.65,886.57 కోట్లు విడుదల చేశామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంత్రితో పాటు పెన్షన్ల పంపిణీలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకురాలు బగ్గు అర్చన పాల్గొన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. సోమవారం ఉదయం సత్యవరం గ్రామానికి చేరుకున్న హోం మంత్రికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. సత్యవరం గ్రామంలో లబ్దిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అనిత పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. శ్రీరాంపురం గ్రామంలో బొడ్డపాటి వీరాస్వామి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. అనంతరం ఇటీవల కాలంలో అకాల వర్షాలకు మరణించిన అరట్లకోట గ్రామానికి చెందిన ఎరకయ్య, శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హోం మంత్రి అనిత భరోసా ఇచ్చారు.

### రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు నోటిఫికేషన్

స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. నేటి నుంచి ఈ నెల 8వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 9న నామినేషన్ల పరిశీలన. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 11 వరకు గడువు తేదీగా ఈసీ ప్రకటించింది. ఎన్నికలు ముగిసిన రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది. బిహార్‌లోని తొమ్మిది రాష్ట్ర శాసన మండలి స్థానాలకు ఎన్నికలు జరగనుండగా ఒక స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు.

### జూన్ 7 నుంచి 21 వరకు యోగా కార్యక్రమాలు

8 వేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని సత్యకుమార్ తెలిపారు. డయాబెటిక్స్, హైపర్ టెన్షన్‌ల కేసులు విపరీతంగా పెరగుతున్నాయన్నారు. అందుకే ఆధునిక జీవన విధానంలో ధ్యానం చాలా అవసరమన్నారు. జూన్ 1 నుంచి 30 వరకు యోగాకు సంబంధించి యూట్యూబ్ వీడియోలను 3 నిముషాల నుంచి గంట వరకు మంతెన సత్యనారాయణ రాజు తయారు చేసినట్లు తెలిపారు. యోగాను విద్యా కరిక్యులమ్‌లో కూడా చేర్చడం జరిగిందని... వేసవి కాలం తరువాత విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. జూన్ 1 నుంచి జూన్ 20 వరకు యోగాలో వివిధ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ కోసం మీడియా కూడా సహకరించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. జూన్ నెలను ఫిజికల్, మెంటల్ హెల్త్‌కు అంకితం చేసుకోవాలని యోగా, నేచరోపతి సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు పిలుపునిచ్చారు. 90 వీడియోలను ఒక్కొక్కటి 5 నిముషాల నిడివితో రెడీ చేసినట్లు తెలిపారు. 21 వ్యాధులకు సంబంధించి థెరపిటిక్ యోగా వీడియోలు 15 నిముషాలు ఉండేలా తయారు చేశామన్నారు. యోగా పట్ల ఉన్న అనుమానాలు, అపోహలు పోగొట్టేలా 50 వీడియోలు చేసినట్లు చెప్పారు. వీటిని డౌన్ లోడ్ చేసుకోవడానికి వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. 8142404888 అనే వాట్సాప్ నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పెడితే గూగుల్ లింక్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని మంతెన సత్యనారాయణ రాజు పేర్కొన్నారు.

### ముఖ్యమంత్రిగా కాదు ..సేవకుడిగా ఉంటా

అన్ని అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారు. బహిరంగ సభకు ఆయన సూట్‌లో రాకపోవడంతో మీరు సూట్ ఎందుకు వేసుకోలేదని ఓ వ్యక్తి ప్రశ్నించాడు. అందుకు ఆయన బదులిస్తూ.. అన్ని విషయాల్లో పారదర్శకంగా, నిరాడంబరంగా ఉంటానని చెప్పడానికే తాను తెలుపు-నలుపు కలిసి ఉన్న సూట్ వేసుకుంటున్నట్లు తెలిపారు. అదేమీ కేవలం ఉన్నతాధికారులు మాత్రమే వేసుకునే డ్రెస్ కోడ్ కాదు కదా అంటూ చిరునవ్వులు చిందించారు.

### మేలో రికార్డు స్థాయిలో తిరుమలకు భక్తులు

భక్తులకు గంటల తరబడి వేచి ఉండే పని లేకుండా కంపార్ట్‌మెంట్‌లలో నిరంతరం తాగునీరు, పాలు, అన్నప్రసాదాల పంపిణీని నిరంతరాయంగా కొనసాగించారు. శ్రీవారిపై భక్తులు తమకున్న అపారమైన భక్తిని కానుకల రూపంలో చాటుకున్నారు. మే నెలలో స్వామివారికి రూ.120.28 కోట్ల ఆదాయం లభించింది. తిరుమల చరిత్రలో ఒకే నెలలో ఈ స్థాయి ఆదాయం రావడం భక్తుల అచంచల విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది. నగదు రూపంలోనే కాకుండా భక్తులు పెద్దఎత్తున బంగారం, వెండి ఆభరణాలను కూడా హుండీలో సమర్పించారు. స్వామివారికి భక్తులు తలనీలాలు సమర్పించారు. మే నెలలో 12,29773 మంది భక్తులు తలనీలాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతిరోజు వేలాది మంది భక్తులు.. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. స్వామి వారి దర్శనానికి ముందుగా భక్తులు తలనీలాలు సమర్పిస్తారు. ఈ ఏడాది తలనీలాలను భక్తులు రికార్డు స్థాయిలో సమర్పించారు. మే మాసంలో 12,43,063 మంది భక్తులు స్వామి వారికి తలనీలాలు ఇచ్చారు. మే 1 నుంచి మే 27వ తేదీ వరకు శ్రీవారికి మొక్కుల రూపంలో భక్తులు తననీలాలు సమర్పించుకున్నారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. గతంలో ఉన్న రికార్డులను ఇది అధిగమించిందని తెలిపింది. 2024 మే నెలలో 10.65 లక్షల మంది, 2025, మే మాసంలో 10.18 లక్షల మంది భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించారని గణాంకాలతో సహా టీటీడీ వివరించింది. మే 18 నుంచి 23వ తేదీ వరకు ప్రతి రోజు 50 వేల మంది భక్తులు తలనీలాలు ఇచ్చారని చెప్పింది. అయితే మే 23వ తేదీ ఒక్క రోజే.. 57,580 మంది భక్తులు తమ మొక్కుల కింద తలనీలాలు ఇచ్చారని పేర్కొంది. ఇటీవల కాలంలో అత్యధికంగా తలనీలాలు సమర్పించినది మే 23వ తేదీ అని టీటీడీ స్పష్టం చేసింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుమలలో కళ్యాణకట్టతోపాటు 11 తలనీలాల కేంద్రాలు ఏర్పాటు చేశామని టీటీడీ వివరించింది. తలనీలాల కోసం 1,150 మంది మంగలి వారిని ఏర్పాటు చేశామంది. వారిలో 269 మంది మహిళలు కూడా ఉన్నారని చెప్పింది. మొక్కుల రూపంలో భక్తులు ఇచ్చిన తలనీలాలను విదేశాలు.. చైనా, ఇటలీ, అమెరికా, బ్రెజిల్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తామని టీటీడీ పేర్కొంది. అలాగే ఇటీవల కాలంలో తలనీలాలను వేలంపాటు వేయడం ద్వారా వస్తున్న ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని తెలిపింది. తలనీలాల ద్వారా 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ. 67 కోట్లు వచ్చిందని వివరించింది. ఇలా ప్రతి ఏడాది తలనీలాల ద్వారా టీటీడీకి భారీగా ఆదాయం పెరుగుతుందని స్పష్టం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం తలనీలాల ద్వారా రూ.200 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని టీటీడీ పేర్కొంది. వేసవి సెలవులతోపాటు వారాంతం సెలవుల కారణంగా భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిందని తిరుమల తిరుపతి దేవస్థానం వివరించింది. స్వామివారికి హుండీ, విరాళాలతోపాటు తలనీలాల రూపంలో కూడా ఆదాయం వస్తుంది. ఇలా వచ్చిన ఆదాయాన్ని భక్తుల సేవకు టీటీడీ వినియోగిస్తున్న సంగతి తెలిసిందే.

### వైఎస్ విగ్రహ ధ్వంసం గొడ్డలి పార్టీ కుట్ర

నాటి వైసీపీ ఎమ్మెల్యేనే ఆ ఉద్యోగం ఇప్పించారని తెలిపారు. మనుషుల తలకాయలే తీసిన గొడ్డలి పార్టీ నేతలకు.. విగ్రహాల తలలు తీయడం ఓ లెక్క కాదన్నారు. విగ్రహం తలకాయను గొడ్డలి పార్టీ నేతలే తీయించడం.. మళ్లీ ధర్నాలు చేయడం ఆ పార్టీకే చెల్లిందంటూ దుయ్యబట్టారు. శవం, సింపతీ, స్టాట్యూ అనేది గొడ్డలి పార్టీ విధానమంటూ వ్యాఖ్యానించారు. వైఎస్ మరణంతో రాష్ట్ర వ్యాప్తంగా విగ్రహాలు పెట్టి రాజకీయం చేశారని.. ఇప్పుడు అదే విగ్రహాలను విధ్వంసం చేసి రాజకీయం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. గతంలోనూ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి తెలుగుదేశం పార్టీపై నెపం నెట్టే ప్రయత్నం చేశారన్నారు. నంద్యాలలో వైఎస్ విగ్రహం విషయంలో కుట్రలు బయటపడ్డాయి కాబట్టి... సాక్షిలో పెద్దగా కవరేజ్ ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదని గొడ్డలి పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తుంటే.. డీఎస్సీలో తప్పిదాలు జరిగాయని ఆరోపణలు గుప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి వ్యవహారాలు బయటపడుతుండడంతో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడే కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఏడాది క్రితం జరిగిన డీఎస్సీ నిర్వహణకు సంబంధించి ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కుట్రలు పన్నడం, అసత్య ప్రచారం చేయడం గొడ్డలి పార్టీ డీఎన్ఏలోనే ఉందంటూ వ్యాఖ్యానించారు. జెన్-జీ, జెన్-అల్ఫా భవితకు అవసరమైన అభివృద్ధి చర్యలు చేపడుతున్నామని అనగాని తెలిపారు. ఎన్నో పెట్టుబడులు వస్తున్నాయని... ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. రాష్ట్ర ముఖచిత్రం మారుతోందని.. దీన్ని చూసి గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందని విమర్శించారు. రాష్ట్రం అగ్రస్థానంలోకి వెళ్తున్నప్పుడు... అనిశ్చితి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ల్యాండ్ స్కాం.. లిక్కర్ స్కాంలు బయటకొస్తుంటే గొడ్డలి పార్టీలో వణుకు పుడుతోందన్నారు. తానిచ్చే బిర్యానికి కార్యకర్తలు ఎదురు చూస్తూ ఉండాలనే ఆలోచన గొడ్డలి పార్టీ నాయకుడిదంటూ దుయ్యబట్టారు. ప్రజలు చక్కటి ఉపాధి, ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుని మెరుగైన జీవితాన్ని పొందాలనేది తమ నాయకుడి ఆలోచన అని తెలిపారు. ఓ డీఎస్సీని అద్భుతంగా నిర్వహించి.. మళ్లీ ఇంకో డీఎస్సీని నిర్వహించు కునేందుకు సిద్ధమవుతుంటే.. కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. యువకులు నిర్వీర్యమైపోవాలనేది గొడ్డలి పార్టీ ఆలోచన అని.. యువతకు ఉద్యోగాలు కల్పించాలనేది కూటమి సంకల్పమని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.


Truhome FINANCE

DEMAND NOTICE

ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(మునుపటి పేరు: శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం: శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోర్ నం.5, పాత నం.11, 2వ లేన్, సెనోటాఫ్ రోడ్, అల్వార్ పేట , తేనాంపేట, చెన్నై - 600018
హెడ్ ఆఫీస్: లెవెల్ 3, వోక్హార్డ్ టవర్స్, ఈస్ట్ వింగ్ C-2 బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబై - 400051 వెబ్‌సైట్: www.truhomefinance.in

ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) నుండి పొందిన రుణ సౌకర్యాల అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో ఈ క్రింది రుణగ్రహీతలు విఫలమ అయ్యారని మరియు పేర్కొన్న రుణ ఖాతాలను నిరర్థక ఆస్తులు (NPA)గా వర్గీకరించారని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. సెక్యూరిటైజేషన్ మరియు రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (SARFAESI ACT)లోని సెక్షన్ 13(2) కింద వారికి డిమాండ్ నోటీసు జారీ చేయబడింది, వారి చివరి చిరునామాలో. పేర్కొన్న డిమాండ్ నోటీసుతో పాటు, ఈ పబ్లిక్ నోటీసు ద్వారా వారికి తెలియజేయబడు తున్నది.
సెక్షన్ 13(2) కింద పంపిన రుణగ్రహీతలు, సెక్యూరిటీలు, బకాయిలు, డిమాండ్ నోటీసుల వివరాలు మరియు అక్కడ క్లెయిమ్ చేయబడిన మొత్తం కింద ఇవ్వబడ్డాయి-

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ పేరు & చిరునామా | సురక్షిత ఆస్తుల ఆస్తి చిరునామా | డిమాండ్ నోటీసు తేదీ & బకాయి మొత్తం రూ. |
|---|---|---|
| శ్రీ.బుంగతావుల రమేష్ S/O వెంకట సుబ్బయ్య శ్రీమతి బుంగతావుల నాగమణి W/O బుంగతావుల రమేష్ R/O డోర్ నెం. 26-12-184 కళ్యాణ్ నగర్ జీవీ నగర్ ఎ.కె నగర్ నెల్లూరు వెనుక వైపు జీవీఆర్ఆర్ కళాశాల భక్తవత్సలనగర్ నెల్లూరు ఆంధ్ర ప్రదేశ్ భారతదేశం 524004 లోన్ మొత్తం -రూ.1087865 & 1585135/- NPA తేదీ 06-05-2026 ఖాతా సంఖ్య: SLPHNELR0000861 & SLPHNELR0000562 | డి.నెం.26-1- 1625/192, అసెస్మెంట్ నెం. 1031049928, ప్లాట్ నెం.141, ఎస్.వై.నెం. 2, కళ్యాణి నగర్ లొకేషన్, పడరుపల్లి ప్రాంతం, నెల్లూరు నగరం, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, శ్రీ పొట్టి, శ్రీరాములు, నెల్లూరు జిల్లాలో ఉన్న ఆస్తి. దీనికి సరిహద్దులు: తూర్పున: ప్రసాద్ ఇల్లు, సౌత్ రోడ పడమరన: శివమ్మ ఇల్లు, ఉత్తరాన: ఆచారి ఇల్లు | డిమాండ్ నోటీసు తేదీ - 13-05-2026 డిమాండ్ నోటీసు మొత్తం రూ.1138914/-(పదకొండు లక్షల ముప్పై ఎనిమిది వేల తొమ్మిది వందల పద్నాలుగు రూపాయలు మాత్రమే) & రూ. 1571513/- (పదిహేను లక్షల డెబ్బై ఒక్క వేల ఐదు వందల పదమూడు రూపాయలు మాత్రమే) 31-05-2026 నాటికి లోన్ ఖాతా నెం. SLPHNELR0000861 & SLPHNELR0000562 |
| శ్రీ.కోరపు కొండల్రావు S/O శ్రీ.కొప్పరపు శివయ్య శ్రీమతి.కోరపు చంద్రకళ W/O కోరపు కొండలరావు డోర్ హెచ్ నెం 10 -106 3/A టీచర్స్ కాలనీ ఏపీజీబీ బ్యాంక్ దగ్గర ప్రొద్దుటూరు కడప ఆంధ్ర ప్రదేశ్ భారతదేశం 516360 రుణం మొత్తం -రూ.4710528/- NPA తేదీ 06-05-2026 ఖాతా సంఖ్య: SHLHTRPT0000723 | వై.ఎస్.ఆర్ కడప జిల్లా, ప్రొద్దుటూరు ఉప జిల్లా, ప్రొద్దుటూరు, కొత్తపల్లి పంచాయతీ, వార్డు నెం. 10 జేమ్స్‌పేట వీధి, మోదమిదపాలి గ్రామం, ప్లాట్ నెం.7 ఆర్.సి.సి. మహది మిద్ద హౌస్ సర్వే నెం. 215 మరియు 216/బి లో ఉన్న, ఇంకా కేటాయించబడని కొత్తగా నిర్మించిన డి.నెం. నివాస భవనం. ఈ క్రింది సరిహద్దులు కలిగి ఉంది: తూర్పు: రాస్తా ప్రకారం 20 అడుగులు, పశ్చిమం: ప్లాట్ నెం.9 స్థలం, దక్షిణం: ప్లాట్ నెం. 8 స్థలం, ఉత్తరం: జాయింట్ రాస్తా షెడ్యూల్ ప్రకారం 20 అడుగులు (రిజిస్టర్డ్ సేల్ డీడ్ తేదీ 12.04.2021 ప్రకారం). కొలతలు | డిమాండ్ నోటీసు తేదీ - 13-05-2026 డిమాండ్ నోటీసు మొత్తం రూ.4856204/-(నలభై ఎనిమిది లక్షల యాభై ఆరు వేల రెండు వందల నాలుగు మాత్రమే) 31-05-2026 నాటికి లోన్ ఖాతా నెం. SHLHTRPT0000723 |
| శ్రీ.శ్రీనివాసులు కె. S/O కె. వెంకటయ్య శ్రీమతి. సుభాషిణి కె. W/O శ్రీ.శ్రీనివాసులు కె. R/O డోర్ నెం .5-101A, తిమ్మయ్య గుంట, వెంకటపురం వాటర్ ట్యాంక్ దగ్గర రేణిగుంట చిత్తూరు ఆంధ్ర ప్రదేశ్ భారతదేశం 517520 లోన్ మొత్తం -రూ.172813 & 543921 & 941658/- NPA తేదీ - 06-05-2026 ఖాతా సంఖ్య: SBTHTRPT0000599 & SILHTRPT0000793 & STUHTRPT0000600 | చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజీ రోడ్డు, తిరుపతి, రేణిగుంట ఉప జిల్లా, రేణిగుంట మండలం, ఆర్. ఆగ్రహారం గ్రామ జనగణన, ప్రభుత్వ సర్వే నెం. 380/12, మొత్తం విస్తీర్ణం 0.020 సెంట్లు, నేను హెక్టారుకు 0.06 సెంట్ల చొప్పున 0.024 ఎకరాలు లేదా దానికి సమానమైన 290.4 చ.మీ. భూమిని మాత్రమే సెటిల్ చేస్తాను. ఈ భూమి యొక్క సరిహద్దుల వివరాలు. తూర్పు: నా ఆధీనంలో ఉన్న భూమి,పడమర: చిన్న నాగయ్య గారి భూమి, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: పిడత రామచంద్రయ్య గారి భూమి. ఈ సరిహద్దుల లోపల, పైన 0.06 సెంట్ల విస్తీర్ణం 0.024 ఎకరాలు లేదా దానికి సమానమైన 290.4 చ.మీ. మాత్రమే. | డిమాండ్ నోటీసు తేదీ - 13-05-2026 డిమాండ్ నోటీసు మొత్తం రూ.188619/-(ఒక లక్షా ఎనభై ఎనిమిది వేల ఆరు వందల పందొమ్మిది మాత్రమే) & రూ.591593/- (ఐదు లక్షల తొంభై ఒక్క వేల ఐదు వందల తొంభై మూడు మాత్రమే) & రూ.954800/- (తొమ్మిది లక్షల యాభై నాలుగు వేల ఎనిమిది వందలు మాత్రమే) 31-05-2026 నాటికి లోన్ ఖాతా నెం. SBTHTRPT0000599 & SILHTRPT0000793 & STUHTRPT0000600 |
| శ్రీ వి. బ్రహ్మయ్య చారి S/O వెంకట రామా చారి శ్రీమతి వడ్ల జయలక్ష్మి W/O శ్రీ వి. బ్రహ్మయ్య చారి R/O నెం 2-5-7/18 టీచర్స్ కాలనీ ఈజ మండలం ప్రధాన రహదారి ఈజ దగ్గర మహబూబ్ నగర్ తెలంగాణ భారతదేశం 509127 లోన్ మొత్తం -రూ.2533785 & 1030234 NPA తేదీ - 06-05-2026 ఖాతా సంఖ్య: SLPHKUNL0000634 & TLPHKUNL0001128 | ఈ ఆస్తి తెలంగాణ, తెలంగాణ జిల్లా, ఐఈజేఏ జోగులాంబ గద్వాల్ టీచర్స్ కాలనీలో, సర్వే నెం. 915, ప్లాట్ నెం. 265, 266, 267 & 268 (గ్రౌండ్ ఫ్లోర్ 1962 చదరపు అడుగులు) గల 533.33 చదరపు మీటర్ల భూమిలో ఉంది. దీని చిరునామా: డోర్ నెం. 2-5-7/18, ఇల్లు. దీనికి సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 280, 279, 278, 277, దక్షిణం: ప్లాట్ నెం. 264 పడమర: 25 అడుగుల రోడ్డు ఉత్తరం: ప్లాట్ నెం. 269 | డిమాండ్ నోటీసు తేదీ - 13-05-2026 డిమాండ్ నోటీసు మొత్తం రూ.1461753/-(పద్నాలుగు లక్షల అరవై ఒక్క వేల ఏడు వందల యాభై మూడు రూపాయలు మాత్రమే) & రూ.1045539/- (పది లక్షల నలభై ఐదు వేల ఐదు వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) 31-05-2026 నాటికి లోన్ ఖాతా నెం. SLPHKUNL0000634 & TLPHKUNL0001128 |
| 1.శ్రీమతి వేమూరు మీనాక్షి S/O శ్రీ.వేమూరు భాను కృష్ణ 2.శ్రీ.వేమూరు భాను కిరణ్ W/O శ్రీ.వేమూరు సుబ్రహ్మణ్యం ఇంటి నెం 3-151/1 ఆంధ్రా బ్యాంక్ కాలనీ అవిలాలతిరుపతి రూరల్ సత్వ పాఠశాల అవిలాలాల్ చిత్తూరు ఆంధ్ర ప్రదేశ్ భారతదేశం 517507 రుణం మొత్తం -రూ.1076153/- NPA తేదీ - 06-05-2026 ఖాతా సంఖ్య: SMLHTRPT0001102 | ఆంధ్రప్రదేశ్, తిరుపతి జిల్లా, తిరుతి మండలం, దిగువ నేతగిరిపల్లి గ్రామం, అసెస్మెంట్ నెం. 513, కుంట్రపాకం పంచాయతీలో ఉన్న,డి.నెం. 5-6/1 గల ఆ భూమి మరియు భవనం,సర్వే నెం. 429లో 252.16 చదరపు గజాల విస్తీర్ణంలో ఉంది మరియు దీనికి సరిహద్దులు: తూర్పున: రోడ్డు, దక్షిణాన: రోడ్డు , పడమరన: వి. జ్యోతి ప్రకాష్ గారి స్థలం మరియు ఇల్లు,ఉత్తరాన: కె. రామమ్మ గారి స్థలం మరియు జాకమ్మ గారి ఇల్లు కొలతలు: తూర్పు నుండి పడమరకు ఇరువైపులా: 53.6 అడుగులు, ఉత్తరం నుండి దక్షిణానికి ఇరువైపులా: 37.6 అడుగులు ACC షీట్ రూఫ్ గల ఇంటి కొలతలు (డోర్ నెం. 5-6/1): తూర్పు నుండి పడమరకు: 14.2 అడుగులు, ఉత్తరం నుండి దక్షిణానికి: 18.7 అడుగులు. మొత్తం కొలత: 240 చదరపు అడుగులు | డిమాండ్ నోటీసు తేదీ – 13-05-2026 డిమాండ్ నోటీసు: లోన్ ఖాతా నెం. SMLHTRPT0001102 సూచన క్రింద, 31-05-2026 నాటికి ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు మీ బాధ్యతలను తీర్చడానికి మరియు పూర్తిగా తిరిగి చెల్లించడానికి కోరబడిన మొత్తం రూ.1199085/- (పదకొండు లక్షల తొంభై తొమ్మిది వేల ఎనభై ఐదు మాత్రమే). |

రుణగ్రహీతలైన మీరు, పైన పేర్కొన్న బకాయిలను ఈ నోటీసు అందిన 60 రోజులలోపు పూర్తిగా చెల్లించవలసిందిగా కోరడమైనది. అలా చేయడంలో విఫలమైతే, పైన పేర్కొన్న సెక్యూరిటీలను అమలు చేయడానికి, SARFAESI చట్టం కింద చర్యలు తీసుకోవలసిన బాధ్యత నాపై ఉంటుంది. దయచేసి గమనించండి, సదరు చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, మా అనుమతి లేకుండా పైన పేర్కొన్న సెక్యూరిటీలను అమ్మకం, లీజు లేదా ఇతర మార్గాల ద్వారా బదిలీ చేయడానికి మీకు అనుమతి లేదు. 25-మే-2026న ప్రచురించబడిన ఆ మునుపటి వేలం ఉపసంహరించబడింది.

స్థలం: నెల్లూరు, కడప / ప్రొద్దుటూరు, తిరుపతి
తేదీ : 02.06.2026

సం /- అధికృత అధికారి – ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(మునుపటి పేరు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

# నేడు కార్పొరేట్ క్రికెట్ లీగ్ ప్రారంభం

## - ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖ నాయకులు, అధికారులు
## - ఏర్పాట్లను పరిశీలించిన ఏసిఏ జాయింట్ సెక్రటరీ



**తిరుపతి,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతిలో మొట్టమొదటిసారిగా చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నేడు తిరుపతి కార్పొరేట్ క్రికెట్ లీగ్ ప్రారంభం కానున్నది. స్థానిక గొల్లవాని గుంటలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో జూన్ 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ టోర్నీలో 8 టీములు 8 రోజులపాటు ఆడనున్నాయి. ఈ ప్రారంభోత్సవంలో భాగంగా సోమవారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) ఎన్టీఆర్ క్రీడామైదానంలోని గ్రౌండ్ ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతమైన క్రికెట్ ఆడాలని ఆకాంక్ష ఉండి ఆడ లేకపోయిన వయస్సు పైబడిన క్రికెట్ క్రీడాకారులకు ఇది గొప్ప అవకాశం అన్నారు. అందులో భాగంగానే 30 సంవత్సరాల పైబడిన వారికి ఈ టోర్నీలో అవకాశం కల్పించినట్లు తెలిపారు. 8 టీం లతో 8 రోజులు పాటు నిర్వహించనున్న ఈ టోర్నీ మొత్తం ఐపీఎల్ ఫార్మాట్ లో జరుగుతుందన్నారు. ఐపీఎల్ లో లాగానే డిఆర్ఎస్, రివ్యూలు, ఎల్బీడబ్ల్యూ, థర్డ్ ఎంపైర్ కూడా ఉంటాయని పేర్కొన్నారు. ప్రేక్షకులందరూ వీక్షించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ మ్యాచ్ లు అన్ని కూడా 7 కెమెరాలతో ప్రత్యక్ష ప్రసారం ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత మూడు రోజులుగా జరుగుతున్న లైవ్ ఏర్పాట్లు, గ్రౌండ్ ఏర్పాట్లు, పిచ్ ఏర్పాట్లు , పెవిలియన్ ఏర్పాట్లు నేడు పూర్తయ్యాయని తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు రాజకీయ ప్రముఖులు, అధికారులు పాల్గొని ఈ తిరుపతి కార్పొరేట్ క్రికెట్ టోర్నీని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని తిరుపతిలో మొట్టమొదటిసారిగా ప్రత్యక్ష ప్రసారం ద్వారా జరుగుతున్న ఈ క్రికెట్ పోటీలను అందరూ ఆదరించి విజయవంతం చేయాలని క్రికెట్ విజయ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంతో గొప్ప ఆలోచనతో ఇంత మంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు ముందుకు వచ్చిన చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కు ఆయన అభినందనలు తెలియజేశారు.

**నేటి మ్యాచ్లు :**

ఉదయం -9:00 గంటలకు సచివాలయం వర్సెస్ తిరుపతి హోటల్స్

మధ్యాహ్నం :1:30 గంటలకు రమణ లాజిస్టిక్స్ వర్సెస్ నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీ .

# అంగన్వాడి కేంద్రాల్లో మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం వడ్డించాలి



**సత్యవేడు, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని వడ్డించాలని తిరుపతి జిల్లా,సత్యవేడు జడ్పిటిసి,జడ్పీ స్త్రీశిశు సంక్షేమ శాఖ స్థాయి సంఘం సభ్యురాలు విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్లకు టిడిపి నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి సూచనల మేరకు ఆమె నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యకరంగా ఎదుగడం కోసం ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా బలవర్ధకమైన ఆహారాన్ని పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే అంగన్వాడి కేంద్రానికి వస్తున్న పిల్లలకు రుచికరమైన ఆహారాన్ని అందించే బాధ్యత హెల్పర్ ల పై ఉన్నట్టు గుర్తు చేశారు. కొత్తగా నియమితులైన హెల్పర్లందరూ వారి వృత్తి ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను కూడా క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కూడా అంగన్వాడి కార్యకర్తలపై ఉందన్నారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు చేపట్టిందన్నారు. అలాగే అంగన్వాడి కేంద్రాలకు వస్తున్న పిల్లల్లో క్రమశిక్షణ పెంపొందించాలన్నారు. ప్రాథమిక స్థాయి విద్యాభ్యాసం కోసం అడ్మిట్ అయ్యే సమయానికి అక్షరాలను నేర్పించి, వారిలో విద్యాభ్యాసం పట్ల ఆసక్తి పెరిగేటట్టు చూడాలన్నారు. తదనంతరం ప్రాజెక్టు పరిధిలోనూతనంగా నియమితులైన ఒక అంగనవాడి కార్యకర్తకు,30 మంది హెల్పర్ ల కు జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి,నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మురళి( చికెన్ చిన్న) నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఇందులో సత్యవేడు మండలం, చెరివి అంగనవాడి కార్యకర్తగా నియమితులైన హరిత,హెల్పర్ లుగా నియమితులైన ఆనందపురం అంగన్వాడి కేంద్రం పద్మ,సీతారాంపేట కుసుమ,సిరణంబూదూరు సుగాసిని,కన్నవరం తేజవతి,జడేరి నాగలక్ష్మి ఉన్నారు. దీంతోపాటు బుచ్చినాయుడు కండ్రిగ మండలం సంబంధించి 14 మంది హెల్పర్లకు, వరదయ్యపాలెం మండలానికి సంబంధించి 11 మంది హెల్పర్లకు, కూడా నియామక పత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమ రావు,ఐసిడిఎస్ సీనియర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మురళి( చికెన్ చిన్న),టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ జడేరిబాబు,టిడిపి ప్రధాన కార్యదర్శి శివయ్య,కోనయ్య,ఐసిడిఎస్ సూపర్వైజర్లు జ్యోతి,యమున పలువురు అంగన్వాడి హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు లో-ఓల్టేజీ సమస్యకు పరిష్కారం

**తొట్టంబేడు, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతమైన బంగారమ్మ కాలనీలో లో-ఓల్టేజీ సమస్యను ఎట్టకేలకు విద్యుత్ శాఖాధికారులు సోమవారం పరిష్కరించారు. విద్యుత్ తీగలు లాగి ట్రాన్స్ ఫార్మర్ కు విద్యుత్ సరఫరా చేశారు. గత రెండేళ్లుగా బంగారమ్మ కాలనీలోని వంద కుటుంబాల వారు లో-ఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ శాఖాధికారులు రాజకీయ ఒత్తిళ్ల సాకుతో ట్రాన్స్ ఫార్మర్, విద్యుత్ తీగల ఏర్పాటు పనులను మధ్యలోనే ఆపేశారు. దీంతో కాలనీ వాసులు సమస్యను ఇటీవల సీపీఎం శ్రీకాళహస్తి కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. సీపీఎం పోరాటం ద్వారా ఎట్టకేలకు అధికారులు దిగొచ్చి సమస్యను పరిష్కరించారు. దీర్ఘకాలికంగా ఉన్న లో-ఓల్టేజీ సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్పీడీసీఎల్ ఏడీ సుధాకర్, ఏఈ బాలాజీ పాల్గొన్నారు.

# మలేరియా నివారణపై అవగాహన

## - మలేరియా రహిత భారతదేశమే లక్ష్యం: డాక్టర్ కుసుమ



**చంద్రగిరి, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి మండల వైద్యాధికారి డా. కుసుమ ఆదేశాల మేరకు జూన్ 2026 'యాంటీ మలేరియా మాసం' పురస్కరించుకుని తొండవాడ గ్రామంలో మలేరియా నివారణ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం ప్రారంభానికి ముందు, మలేరియా వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉండే జూన్ నెలను 'యాంటీ మలేరియా మాసంగా' నిర్వహిస్తారని వైద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. 2026 సంవత్సరానికి గాను డ్రై వెన్ టు ఎండ్ మలేరియా (మలేరియా నిర్మూలన దిశగా ముందుకు సాగుదాం - ఇప్పుడు మనకు సాధ్యం, ఇప్పుడు మనం చేయాల్సిందే) అనే ప్రత్యేక థీమ్‌తో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం 2030 నాటికి దేశంలో స్వదేశీ మలేరియా కేసులను శూన్యానికి చేర్చి, మలేరియా రహిత భారతదేశాన్ని సాధించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

# మినీ బస్ ఢీకొని వృద్ధుడు మృతి





**తిరుపతి సిటీ, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి ):** తిరుపతి టీఎంసీ కళ్యాణ మండపం సర్కిల్ వద్ద సోమవారం తెల్లవారు జామున శ్రీనిజ ట్రావెల్ మినీ బస్సు వేగంగా వచ్చి ఢీకొన్న సంఘటనలో ఒక వృద్ధుడు మృతి చెందారు. మృతుడు వేణుగోపాల్ రెడ్డి (82) గా గుర్తించారు. మినీ బస్సు పాదాసారథి తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు శివ నారాయణ ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనిజ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ముని శంకర్ నిర్లక్ష్య డ్రైవింగ్ వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు.

# కన్నీటి సంద్రంలో అగరాల.. వైఎస్సార్‌సీపీ నేత భాస్కర్‌రెడ్డికి అశ్రునివాళి

## -పూలమాల వేసి నివాళులు అర్పించిన చెవిరెడ్డి దంపతులు
## -పార్థీవదేహంపై పార్టీ జెండా కప్పిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి
## -పాడె మోసి తుది వీడ్కోలు పలికిన చెవిరెడ్డి కుమారులు

**చంద్రగిరి, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అగరాల గ్రామాన్ని కన్నీటి సంద్రంలో ముంచెత్తుతూ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, అగరాల తాజా మాజీ సర్పంచ్ తూకాకుల భాస్కర్‌రెడ్డి (47) అకాల మరణం పార్టీ శ్రేణులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. ప్రజలకు అండగా నిలిచే నాయకుడిగా, కార్యకర్తలకు ఆప్తుడిగా, గ్రామ ప్రజలకు కుటుంబ సభ్యుడిలా మెలిగిన భాస్కర్‌రెడ్డి సోమవారం ఉదయం ఆకస్మిక గుండెపోటుతో కన్నుమూయడం ప్రతి ఒక్కరినీ కలచివేసింది. ఆయన మరణవార్త తెలిసిన క్షణం నుంచే అగరాల గ్రామం శోకసంద్రంగా మారగా, గ్రామ వీధులన్నీ విషాద ఛాయలతో నిండిపోయాయి. గుండె పోటుకు గురైన భాస్కర్‌రెడ్డిని కుటుంబ సభ్యులు అత్యవసరంగా స్విమ్స్ ఆసుపత్రికి తరలించగా, సమా చారం అందుకున్న వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అక్కడికి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో భాస్కర్‌రెడ్డి తుదిశ్వాస విడిచారు. ఈ వార్తతో పార్టీ శ్రేణులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.



**జనసంద్రంగా మారిన అగరాల**

భాస్కర్‌రెడ్డి పార్థీవదేహాన్ని అగరాలకు తరలించగానే వేలాదిమంది గ్రామానికి చేరుకున్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తండోపతండాలుగా వచ్చి తమ అభిమాన నేతకు నివాళులు అర్పించారు. భాస్కర్‌రెడ్డి చివరి చూపు కోసం ప్రజలు బారులు తీరగా, గ్రామమంతా రోదనలతో మారుమోగింది. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండే నాయకుడిని కోల్పోయామని పలువురు కన్నీరుమున్నీర య్యారు.

**చెవిరెడ్డి రాకతో భావోద్వేగ దృశ్యాలు**

భాస్కర్‌రెడ్డి పార్థీవదేహానికి నివాళులు అర్పించేందుకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులు అగరాలకు చేరుకోగానే అక్కడి వాతావరణం మరింత ఉద్విగ్నంగా మారింది. మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చెవిరెడ్డిని చూసి బోరున విలపించారు. ముఖ్యంగా భాస్కర్‌రెడ్డి సోదరుడు, మాజీ సింగిల్ విండో చైర్మన్ దేవారెడ్డి కన్నీరుమున్నీరవుతూ రోదించిన తీరు అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. అనంతరం చెవిరెడ్డి దంపతులు భాస్కర్‌రెడ్డి పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. భాస్కర్‌రెడ్డి మృతి పార్టీకి మాత్రమే కాదు, తమ కుటుంబానికి కూడా తీరని లోటు అన్నారు. ఒక నమ్మకమైన సహచరుడిని, ఆత్మీయుడిని కోల్పోయాం అంటూ చెవిరెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు.

**పార్టీ జెండా కప్పి.. పాడె మోసి రుణం తీర్చుకున్న చెవిరెడ్డి కుమారులు**

భాస్కర్‌రెడ్డికి తుది వీడ్కోలు సందర్భంగా వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హర్షిత్‌రెడ్డిలు ఆయన పార్థీవదేహంపై వైఎస్సార్‌సీపీ జెండా కప్పి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం ఇంటి నుంచి శ్మశానం వరకు భాస్కర్‌రెడ్డి పాడెను స్వయంగా మోసి చిట్టచివరి గౌరవాన్ని, ఆయనపై తమకున్న ఆప్యాయతను చాటుకున్నారు. గ్రామ సమీపంలోని వారి వ్యవసాయ భూమిలో అంత్యక్రియలు నిర్వహించగా, వేలాదిమంది ప్రజలు పాల్గొని అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు. భాస్కర్‌రెడ్డి అకాల మరణం అగరాల గ్రామానికే కాదు, చంద్రగిరి నియోజకవర్గ రాజకీయాలకు కూడా తీరని లోటుగా మిగిలిందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

# తిరుపతి జిల్లా

# ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు హర్షనీయం

## - బుజ్జిబాబు నాయుడు

**చంద్రగిరి, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, పాకాల రైల్వే స్టేషన్ ఆవరణలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు కావడం పట్ల బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి అధ్యక్షులు సూరినేని బుజ్జిబాబు నాయుడు సోమవారం కొబ్బరికాయలు కొట్టి,మిఠాయిలు పంచి హర్షం వ్యక్తం చేశారు. బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో పాకాల రైల్వే జంక్షన్ ఆవరణలో వినాయకుని చిత్రపటానికి పూలమాలవేసి,టెంకాయలు కొట్టి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సూరినేని బుజ్జిబాబు నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని తెలియజేశారు. దీంతో రైల్వే జోన్ ఏర్పాటు కావడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. అదేవిధంగా బాలాజీ రైల్వే డివిజన్ పేరుతో ఐదవ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు అవసరమైన స్థలం పాకాలలో సుమారు 314 ఎకరాలు పై చిలుక ఉన్నదని తెలియజేశారు. రైల్వే డివిజన్ ఏర్పాటు అయితే తిరుపతి జిల్లా వేగవంతంగా అభివృద్ధి చెందుతుందని,అదేవిధంగా పాకాలలో కూడా ఉపాధి అవకాశాలు మెరుగుపడి,ఆదాయం పెరిగి అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో టి.ఆర్.సి సురేంద్రబాబు, ఎల్.వి బాబు,ఎల్.బి నిఖిల్ చౌదరి,ఆర్.వి ప్రసాద్,రాధాకృష్ణ,మందలపు వెంకటేష్ బాబు,మచ్చా వేణుగోపాల్ నాయుడు,దేవరింటి మోహన్ చౌదరి, బుజ్జి,సుబ్రహ్మణ్యం,కృష్ణమూర్తి, రవిచంద్ర,ప్రసాద్ రావు,అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# పులికుండ్రంలో ఎమ్మెల్యేచే పింఛన్లు పంపిణీ



**పిచ్చాటూరు, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ తో వృద్ధులకు, వితంతువులకు, ప్రత్యేక అవసరాలు గల వారికి ప్రభుత్వం చేయూతను అందిస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. జూన్ 1వ తేదీన సోమవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, పిచ్చాటూరు మండ లం, పులికుండ్రంలో పర్యటించి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయంలోనే పింఛన్ భారీగా పెరిగిందని, తద్వారా వృద్ధులు, వితంతువులు, ప్రత్యేక అవసరాల వ్యక్తులను అన్నీ విధాలుగా ఆదుకుంటున్నామని ఎమ్మెల్యే వివరించారు. అలాగే స్పౌస్ ద్వారా వితంతువులకు కొత్త పెన్షన్లు మంజూరు అవుతోందని, రాష్ట్రంలో కొన్ని లక్షల మంది వితంతువులు దీని ద్వారా లబ్ది పొందనున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మహమ్మద్ రఫీ, ఏఎంసీ మాజీ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, నాయకులు పద్దు రాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# పెన్షన్లు పంపిణీ: లయన్ పటాన్ ఖాదర్ భాషా

**కడప అర్బన్ , జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సిఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జోనల్ కో-ఆర్డి నేటర్ రెడ్డప్పగారి శ్రీనివాస్ రెడ్డి కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి నాయకత్వంలో సోమవారం 27వ డివిజన్ గౌస్ నగర్ తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీ నాయకుడు లయన్ పటాన్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేశారు. అనంత రం ఖాదర్ భాషా మాట్లాడుతూ ఉదయాన్నే తలుపు తట్టి వికలాం గులు, వితంతువులు, వృద్ధులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇచ్చామ న్నారు. అవ్వ తాతల పెద్ద కొడుకు నారా చంద్రబాబు నాయుడు అని వాళ్ళ యోగ క్షేమాలు తెలుసుకొని పింఛన్ ద్వారా అవసరాలు తీరుతాయని చెప్పారు. మందులు వాళ్ల సొంత ఖర్చులకు ఉపయో గపడతాయన్నారు. ఈ కార్యక్ర మంలో సచివాలయం కార్పొరేషన్ సిబ్బంది తోపాటు తెలుగుదే శంపా ర్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఇందిరా నగర్‌లో తాగునీటి సమస్య తీర్చండి

**చింతకొమ్మదిన్నె , జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగర శివారు రిమ్స్ దగ్గర ఉన్న ఇందిరానగర్ ప్రాం తంలో గత 11 రోజులుగా నీటి సమస్య వేధిస్తున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇందిరానగర్ మూడవ సర్కిల్ లోని తూర్పు దిక్కున ఉన్న మోటారు పనిచేయక ఆ ప్రాం తంలో ఉన్న ప్రజలు నీటితో చాలా ఇబ్బంది పడుతు న్నారని రాయల సీమ కమ్యూనిస్టు పార్టీ నాయ కులు రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైరు ఫీజు మార్చడానికి 11 రోజుల కాలం పట్టిందంటే కార్పొరేషన్ సిబ్బంది పనితీరు అర్థం చేసుకోవ చ్చున్నా రు. పేద ప్రజల జీవించే ప్రాంతాల్లో అధికారులు పట్టించుకోవడం శోచనీయమన్నారు. వెంటనే స్పందించి త్వరగా పని పూర్తి చేసి ఆ ప్రాంత ప్రజలకు నీటిని అందిం చాలన్నారు. ఇందులో సి కె దిన్నె మండల కార్యదర్శి మడగలం ప్రసాద్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు రవి, ఆ ప్రాంత మహిళలు పాల్గొన్నారు.

# మూడు కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ : డాక్టర్ మురుగన్

**పలమనేరు,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రూరల్ మండలంలోని సముద్ర పల్లి గ్రామానికి చెందిన రామాంజులు అనే అతనికి ప్రమాదంలో కాలు పోయినది. అతనికి ట్రై సైకిళ్ల తో పాటు సరుకులు పంపిణీ ఆశాజ్యోతి డిజాబుల్ సర్వీస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో, దాత్రీ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ స్వాతి చక్రపాణి వారు చెత్తపెంట గ్రామంలో విద్యుత్ షాక్ తో రాము, కావ్య అనే దివ్యాంగురాలకు వారి రెండు కుటుంబాలకు ఈ స్వచ్ఛంద సంస్థలు వారు శ్రీ తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్, డాక్టర్ మురుగన్ చేతుల మీదుగా నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. అదేవిధంగా ఒక అతనికి చిల్లర అంగడి పెట్టిస్తానని డాక్టర్ మురుగన్ వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

**గూడూరు, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు సోమవారం కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ఆధ్వర్యంలో ప్రతినెల నిరంతరాయంగా కొనసాగిస్తున్న కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ షరీనా చేతుల మీదుగా ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు నిరుపేదలైన బాలింతలకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు కటకం శ్రీనివాసులు మాట్లాడుతూ దేవుడు ఆశీస్సులతో దాతల సహాయ సహకారంతో అలాగే సోమవారం ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన మా కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మా సభ్యుల సహాయ సహకారాల తోనే ప్రతి నెల క్రమం తప్పకుండా నిరంతరాయంగా హాస్పిటల్ నందు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని నిరుపేదలు ఎక్కడుంటే అక్కడ మా కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఉంటుందని తెలియజేశారు. డాక్టర్ షరీనా మాట్లాడుతూ కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినెల ప్రభుత్వ హాస్పిటల్ నందు క్రమం తప్పకుండా బాలింతలకు, పేషెంట్లకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేయడం చాలా సంతోషమని దూర ప్రాంతాల నుండి హాస్పిటల్ కి వచ్చే పేద ప్రజలకు ట్రస్ట్ సభ్యుల వారు చేస్తున్న ఇటువంటి సేవలు ఎందరికో స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు,అత్తిమంజూరి గోపాల్ ,సభ్యులు. చవల సురేంద్ర,ఎస్.కె.ముజీఫ్, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి, దొంగతనాలపై నిఘా ఉంచాలి

## - డీఎస్పీ పావని

**ములకలచెరువు ,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గంజాయి, దొంగతనాలపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలని మదనపల్లి డిఎస్పి పావని తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గం మొలకలచెరువు మండలంలోని పోలీస్ స్టేషన్ ను సోమవారం మదనపల్లి డిఎస్పి పావని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలించారు. డిఎస్పి మాట్లాడుతూ ఇటీవల కాలంలో నియోజకవర్గంలో గంజాయి వాడు ఎక్కువగా ఉంటుందని వాటిని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ములకలచెరువులో ఇటీవల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిపై దృష్టి సారించాలన్నారు. పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులను మర్యాదగాపూర్వకంగా పలకరించి వారి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. రాత్రి వేళల్లో గస్తీలు ముమ్మరం చేసి దొంగతనాలు జరగకుండా నియంత్రించాలని తెలిపారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా నియంత్రించాలని తెలియజేశారు. డీఎస్పీ వెంట సీఐ దస్తగిరి, ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# డీఎస్సీ అవకతవకలపై విచారణ జరిపించాలి

**- జిల్లా కలెక్టరేట్ ఎదుట వైసిపి విద్యార్థి విభాగం నాయకుల ధర్నా**

**- కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన యువజన విభాగం నాయకులు**

**చిత్తూరు,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డీఎస్సీ - 2025 అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రీజనల్ కో - ఆర్డినేటర్ హేమంత్ రెడ్డి, చిత్తూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు మనోజ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ ఎదుట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో తొలుత చిత్తూరు అమూల్ పాల డెయిరీ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు, నిరుద్యోగులు ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీని చిత్తూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎంసీ విజయానందరెడ్డి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ రెండవ గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర విద్యాశాఖకు, విద్యాశాఖ మంత్రికి, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా హేమంత్ రెడ్డి, మనోజ్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీఎస్సీ - 2025 నోటిఫికేషన్ ను విడుదల చేసిందన్నారు. ఆ డీఎస్సీ రాత పరీక్షల నిర్వహణ, నియామకాల్లో భారీగా అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. సంబంధిత డీఎస్సీ రాత పరీక్షలో ఓ ఔట్సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంకు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. అదే డీఎస్సీలో వందలాది మంది అభ్యర్థులు ఫేక్ సర్టిఫికెట్ల ద్వారా అక్రమంగా ఉపాధ్యాయ ఉద్యోగాలను పొందారని, ముఖ్యంగా క్రీడల కోటాలో భారీ అవినీతి జరిగిందని అరోపించారు. డీఎస్సీ అవకతవకలపై తమ పార్టీ ద్వారా కోర్టులో కేసు వేయడంతో పాటు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో అప్రమత్తమమైన రాష్ట్ర విద్యాశాఖ మొదటి ర్యాంకు అభ్యర్థి పేరును అధికారిక వెబ్ సైట్ నుంచి తొలగించడం చూస్తే ఆ డీఎస్సీలో ఏ మేరకు అవకతవకలు జరిగి ఉంటాయో తెలుస్తోందన్నారు. దీంతో పాటు వందల సంఖ్యలో అభ్యర్థులు ఫేక్ సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగాలు పొందినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత డీఎస్సీలో అవకతవకలకు పాల్పడిన, ఫేక్ సర్టిఫికెట్లతో ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారిని వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా భారీ ఎత్తున జరిగిన అవినీతి, అక్రమాలు, కుట్రకు బాధ్యులైన అధికారులు, ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే సిబిఐ చేతగాని, హైకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా గాని విచారణ జరిపించాలన్నారు. అప్పటి వరకు డీఎస్సీ - 2025 అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో దశలవారీగా పలు రీతుల్లో ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. కాగా ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో వైయస్సార్సీపి యువజన, విద్యార్థి విభాగాల నాయకులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు పాల్గొన్నారు.



# చిత్తూరు రైల్వే స్టేషన్‌ను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతాం

**- ఈస్ట్ కోస్టల్ పరిధిలోకి చిత్తూరు రైల్వే స్టేషన్ రావడం హర్షణీయం - చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**

**చిత్తూరు, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా కేంద్రంలోని చిత్తూరు రైల్వే స్టేషన్ ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతామని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలియజేశారు. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా ఈస్ట్ కోస్టల్ పరిధిలోకి చిత్తూరు రైల్వే స్టేషన్ రావడం హర్షణీయమన్నారు. ఇందుకు సహకరించిన దేశ ప్రధాని మోదీ, కేంద్ర రైల్వేశాఖ మంత్రులకు ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంధ్రుల దశాబ్దాల కలకు సాకారం అయిన నేపథ్యంలో సోమవారం నుంచి విశాఖ కేంద్రంగా 18 వ రైల్వే జోన్ ఆవిర్భావించింది. చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు చిత్తూరు రైల్వే స్టేషన్ సందర్శించారు. రైల్వే స్టేషన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ.., ఇందుకోసం అహర్నిశలు శ్రమించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి లోకేష్ బాబుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల చిరకాల కల విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ సాకారం అయ్యిందన్నారు. 2019 ఎన్నికలకు ముందే కేంద్ర ప్రభుత్వం రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రకటన చేసినా, గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందనీ,. భూములు అప్పగించాలని కేంద్రం ఎన్ని సార్లు కోరినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, ఏపీ సీఎం చంద్రబాబు చొరవతో విభజన హామీలను నెరవేర్చే దిశగా ముందుకు సాగడం, కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ తరపున విశాఖ రైల్వే జోనల్ కోసం తన వంతు కృషి చేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును రైల్వే అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. అలాగే తిరుపతిని బాలాజీ రైల్వే డివిజన్ గా ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరుతూ, తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావుకు వినతి పత్రం సమర్పించారు. అదే విధంగా రైల్వే కూలీలు, రైల్వే సంఘాల నాయకులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చిత్తూరు ఎంపీకి వినతులు సమర్పించారు. దీనికి సానుకూలంగా స్పందించిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపుతానని తెలియజేశారు.




## ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి: ఎన్నార్ అశోక్



**పుంగనూరు ,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పుంగనూరు మండలం అగ్రహారం సమీపంలోని సర్వే నంబర్ 291లో ప్రభుత్వానికి చెందిన విలువైన భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి టమాటా పంట సాగు చేస్తున్నారని రాష్ట్ర మాల మహానాడు ఉపాధ్యక్షుడు ఎన్ఆర్ అశోక్ ఆరోపించారు. సోమవారం ఎమ్మార్వో కార్యాలయం ముందు ఎన్ఆర్ అశోక్ మాట్లాడుతూ ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకుని నిరుపేద దళిత కుటుంబాలకు కేటాయించాలని ఆయన కోరారు. బాల గురవయ్యగారిపల్లెలోని ఇందిరమ్మ కాలనీ ఇళ్లు శిథిలావస్థకు చేరాయని వర్షాలు కురిస్తే కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇటువంటి వారికి మరియు గృహాలు లేని దళిత కుటుంబాలకు శాశ్వత నివాసాల నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిని కేటాయించడం అవసరమని ఆయన తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టడంలో అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్ఆర్ అశోక్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసినట్లు ఆయన చెప్పారు. ఆక్రమిత భూమిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో దళిత నాయకులు పెంచిపల్లి కృష్ణప్ప, కుమార్, బాల గురవయ్య, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై ఆందోళన అవసరం లేదు: ఎంఆర్వో

**పుంగనూరు ,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పుంగనూరు నియోజవర్గంలో నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంఆర్వో రాము తెలిపారు. సోమవారం ఎమ్మార్వో రాము మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ ప్రారంభం కానున్నట్లు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి నమోదు, మార్పులు చేర్పులు తొలగింపులకు సంబంధించిన వివరాలను సేకరిస్తారని చెప్పారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలతో ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా ఖచ్చితంగా రూపొందించడమే ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు బీఎల్ఓలకు సహకరించి సరైన సమాచారాన్ని అందించాలని ఆయన కోరారు. ఎలాంటి అపోహలు అనుమానాలకు తావివ్వకుండా ఎన్నికల శాఖ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని తాసిల్దార్ రాము కోరారు.

# పలమనేరులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ్ ఆంధ్ర



**పలమనేరు, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమం నిర్వహించవలెనని ఆదేశించారు. మే 30వ తేదీ శని వారం ఉదయం పట్టణంలోని ఓం శక్తి గుడి, ఎద్దుల చెరువు, కాకా తోపు తదితర ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ.... పలమనేరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో మరింత మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహణకై తగు చర్యలు తీసుకుంటామన్నారు. సానిటరీ సెక్రటరీలు ద్వారా ఎప్పటికప్పుడు క్లీనింగ్, బ్లీచింగ్ కాలువల పూడిక తీత పనులు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్యనికి ప్రజల ఆరోగ్యానికి పెద్ద పేట వేస్తుందని తెలిపారు. ఆరోగ్య ప్రమాణాల విషయమై మరింత కృషి చేస్తారు. స్వచ్ఛంద సంస్థలు స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ కై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వార్డుల వారీగా ఒక నిర్దిష్ట ప్రణాళికల ప్రకారం అన్ని చిన్న మధ్య పెద్ద కాలువల పూడికతీత పనులు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఏపీ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వార్డు సచివాలయ సెక్రటరీలు ద్వారా జూన్2026 మాసపు పెన్షన్లు 1-6-26 ఉదయం 6 గంటల నుండి సాధ్యమైనంత త్వరగా లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి 100 శాతం పంపిణీ చేయాలని తెలిపారు. ఈ మొత్తం పెన్షన్లు 4448 కు గాను 3910 మంది లబ్ధిదారులకు 89 శాతం పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, టిపిఓ ఇందిరా, సానిటరీ ఇన్స్పెక్టర్ బాబు రెడ్డి నాయక్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కౌండిన్య పూడికతీతల్లో అవకతవకలు

**- ప్రజాధనం వృధా కాకుండా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్‌కు లేఖ**



**పుంగనూరు ,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ పరిధిలోని కౌండిన్య వంకలో జరుగుతున్న పూడికతీత పనులలో అవకతవకలు జరుగుతున్నాయని సోమవారం బిజెపి మైనార్టీ నాయకులు ఆయుబ్ ఖాన్ నరసింహులు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ కు లేఖ రాసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రకటనలో గత కొంతకాలంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కౌండిన్య వంకలో మట్టి తీసే కార్యక్రమం జరిగిందని .అయితే, వంక నుండి తీసిన మట్టిని నిబంధనల ప్రకారం వేరే ప్రాంతానికి తరలించాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు ఆ మట్టిని వంకకు అతి సమీపంలోనే (ప్రక్కనే) కుప్పలుగా పోస్తున్నారని చిన్నపాటి వర్షం రాగానే ఆ మట్టి అంతా తిరిగి వంకలో కె వస్తున్నదని ఇప్పటికే ఇదే వంకలో మూడు సార్లు మట్టి తీయడం, ఆ మట్టి మరలా వంకలోనే పడటం జరిగిందని , దీనివల్ల వంక విస్తరణకు ఎటువంటి ప్రయోజనం చేకూరకపోగా, ప్రజల సొమ్ము మాత్రం బిల్లుల రూపంలో వృధా అవుతున్నదని, . కేవలం బిల్లులు క్లియర్ చేసుకోవడానికే ఈ పనులు చేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది అని , మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్ ఈ విషయంపై తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని కోరుతున్నాము. ఇకపై తీసిన మట్టిని వంకకు దూరంగా తరలించేలా చూడాలని, అలాగే గత మూడు సార్లు జరిగిన పనుల వ్యయం పై విచారణ జరిపించాలని పుంగనూరు ప్రజల తరఫున డిమాండ్ చేస్తున్నామని స్పెషల్ ఆఫీసర్ కు లేఖ ద్వారా తెలుపుతున్నామన్నారు.

## పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మాధవరెడ్డి



**పుంగనూరు ,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని మంగళం పంచాయతీ మంగళం గ్రామం నందు సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మాధవరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సోము , సుధ,రమణ, నాగరాజా పాల్గొన్నారు.



# చిత్తూరు జిల్లా

## అర్హులందరికీ కొత్త పింఛన్లు

**- ఎమ్మెల్యే గురజాల**



**చిత్తూరు, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అర్హులైన వారందరికీ ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందని, త్వరలోనే మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. సోమవారం ఉదయం చిత్తూరు నగరపాలక పరిధిలోని 2 వ డివిజన్ మురకంబట్టు పిళ్లయార్ గుడి వద్ద నుంచి ఎమ్మెల్యే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను సొమ్ములు అందించారు. ఎస్ మనోహర్ అనే లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి రూ 6 వేలు పింఛను సొమ్ములు అందించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు వృద్ధులు, వికలాంగుల ఇంటి వద్దకే వెళ్లి పింఛను సొమ్ములు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనేక ఆర్థిక ఇబ్బందులున్నా.. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. స్పౌంజ్ కేటగిరీ కింద ప్రతినెల కొత్త వారికి పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో చుడ చైర్ పర్సన్ కఠారి హేమలత, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ త్యాగరాజన్, చిత్తూరు నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, స్థానిక కూటమి పార్టీల నాయకులు పచ్చయప్ప, ఉదయ్, వెంకటేష్, నాగరాజు, మురుగ, నవీన్, ప్రతిభ, గోపి, తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో జింక మృతి



**పలమనేరు ,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గంగవరం మండలంలోని పత్తికొండ అటవీ ప్రాంతంలో ఉన్న జింక వ్యవసాయ పొలాల వద్ద మేత మేస్తుండగా దానిని చూసి కుక్కలు జింకను తరిమి వేయడంతో ఆ జింక అటు ఇటు తిరుగుతూ పలమనేరు పట్టణ సమీపంలోని బోమి దొడ్డి వద్ద ఉన్న నీలకుంట గ్రామ సమీపంలో కుక్కలు జింకపై దాడి చేయడంతో జింక మృతి చెందినది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు దానిని ఫారెస్ట్ కార్యాలయానికి తరలించి పోస్టుమార్టం చేసి దహనం చేయనున్నట్లు ఎఫ్ ఆర్ వో చంప్లా నాయక్ తెలిపారు.

## నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బి శంకర్



**కుప్పం, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా డాక్టర్ బి శంకర్ సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది నూతన ప్రిన్సిపాల్ కు ఘన స్వాగతం పలకగా, ఇప్పటివరకు ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ గా కొనసాగిన ప్రదీప్ కుమార్ నూతన ప్రిన్సిపాల్ కు పదవి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకులుగా పదవీ బాధ్యతలు నిర్వహించిన తాను పదోన్నతి పై ప్రిన్సిపల్ గా కుప్పం డిగ్రీ కళాశాలలో పదవీ బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. తాను చేపట్టిన పదవీ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తానని, అలాగే కళాశాల అభివృద్ధికి సైతం శక్తి వంచన లేకుండా తన వంతు బాధ్యత నిర్వహిస్తానని తెలిపారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ




**కుప్పం, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని పాతపేట ప్రాంతంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ కడ అడ్వైజర్ మాజీ మండల జిల్లా పరిషత్ సభ్యులు రాజ్‌కుమార్ లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు పార్టీ అధ్యక్షులు, బూత్ ఇన్‌చార్జీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే పరమావధిగా చంద్రబాబు పాలన



**రామకుప్పం, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామకుప్పం మండలలో సోమవారం ఎన్టిఆర్ సామాజిక భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలోపెద్ద ఎత్తున ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కెంపసముద్రం, మిట్టపల్లి, లింగాపురం గ్రామాలలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ ,మాజీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, ఆనంద్ రెడ్డి లబ్ధిదారులకు స్వయంగా పింఛను డబ్బులను అందజేసి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తూ ప్రజా సంక్షేమమే పరమావధిగా తమ పాలన సాగిస్తున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సీతాపతి, రవి రెడ్డి, నందా రెడ్డి,విజయకుమార్ రెడ్డి,రామకృష్ణప్ప, సలామ్ సాబ్, మాజీ ఎంపిటిసిలు అల్లి శ్రీను,రవి , శ్రీనివాసులు, అవినాష్ రెడ్డి, బాలు, సుబ్రీ, చంద్ర శేఖర్ రెడ్డి,గిరిబాబు,ఆదిల్, చాన్బాషా,సుబ్బన్న, లక్ష్మీ నారాయణ, చలపతి, వెంకట రమణ,పంచాయతీ కార్యదర్శి సోమశేఖర్,సచివాలయ సిబంది పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సతీమణి పావని గౌడకు సన్మానం



**పలమనేరు ,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు పట్టణంలో వెలసియుండు శ్రీ శ్రీ తిరుపతి గంగమ్మ జాతర పూర్తి అయిన సందర్భంగా ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా మా మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ్ సతీమణి పావని గౌడ్ కు అమ్మవారి చీర,పసుపు,కుంకుమ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం ఆమెకు శాలువా కప్పి పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ గంగమ్మ గుడి చైర్మన్ నరేష్, డైరెక్టర్ హరీష్, ప్రసాద్ రెడ్డి, హేమంత్ యాదవ్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

# టమోటా రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే షాజహాన్ బాషా, ఏఎంసీ చైర్మన్ జంగాల శివరాం స్పష్టం**



**మదనపల్లె,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టమోటా రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు.సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం ఆధ్వర్యంలో నిర్వహించిన మార్కెట్ కమిటీ జనరల్ బాడీ సమావేశానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఇందులో భాగంగా మార్కెట్ యార్డుకి వచ్చే రైతులకు విశ్రాంతి భవనం ఏర్పాటు,పురుషులకు మహిళలకు విడివిడి గా వాష్ రూంల నిర్మాణం చేపట్టడం, వేయింగ్ మిషన్ తొలగింపుకు కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.రానున్న సీజనులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.పాలకవర్గం తీర్మానం ప్రకారం కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సెక్రటరీ జగదీష్ కు ఎమ్మెల్యే సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల క్షేమమే ధ్యేయంగా పనిచేస్తుం దన్నారు.పురుషులు, మహిళలకు విడివిడిగా వాష్ రూంలను నిర్మించేందుకు ఈరోజే చర్యలు చేపట్టాలని తెలి పారు.అనంతరం చైర్మన్ జంగాల శివరాం మాట్లాడుతూ జాతీయ రహదారిపై అక్రమాలకు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.వైస్ చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ రైతుల కోసం మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయాలని కోరారు.ఎమ్మెల్యే షాజహాన్ బాషా సహకారంతో రానున్న సీజన్ సమస్యలు లేకుండా రైతులు, వ్యాపారస్తులకు మెరుగైన సేవలు అందించేందుకు మార్కెట్ కమిటీ పాలకవర్గం పనిచేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శంకర్ నాయుడు,డాన్స్ రెడ్డి శేఖర్,చల్లా నరసిం హులు,మున్నా నాయక్,సిటిఎం జిలాని, సుబ్రహ్మణ్యం రెడ్డి,శ్యామలమ్మ, ఓబయ్య, తెలుగుదేశం నాయకులు జెసిబి వేణు,సురేందర్ రెడ్డి, రామిశెట్టి కృష్ణ (కమలా మ్రి),బాలమాలి శేఖర్,రమేష్ రెడ్డి,కాశీ శ్రీరామ్ వాల్మీకి,ప్రభాకర్, పసుపులేటి శ్రీనివా సులు, హమాలీ వర్కర్స్ యూనియన్‌నాయకులు ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ అక్రమాలపై విచారణ జరపాలి

**- వైకాపా యువజన విభాగం ఆధ్వర్యంలో నిరసన**




**మదనపల్లె, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ విఫలమయ్యారని,మెగా డీఎస్సీలో అక్రమాలు లోకేష్ చలువేనని,సిఎంగా చంద్రబాబునాయుడు చేసిన తొలి సంతకం అక్రమాలకు నాంది పలికిందని వైఎస్సార్సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ విమర్శలు గుప్పించారు.వైకాపా యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కె.ఇర్ఫాన్,అన్నమయ్య జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు యలగచెర్ల శివప్రసాద్ రెడ్డి,మదనపల్లె నియోజకవర్గం అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లె జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి మదనపల్లె సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్,పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పరిశీలకురాలు అనూష రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.నిరుద్యోగులు, డిఎస్సీ మెరిట్ లిస్ట్ కోసం పోరాట చేస్తున్న వారు,వైకాపా యువజన కార్యకర్తలు, విద్యార్థి విభాగం నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కూటమి ప్రభుత్వం నిర్వహించిన డిఎస్సీ అక్రమాలు నిరసిస్తూ నినాదాలు చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం చేసిన మెగా డిఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని,ఇది మెగా డిఎస్సీ " కాదు,అవినీతి దగా డిఎస్సీ అని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.మంత్రి నారా లోకేష్ బాబు విద్యా శాఖ మంత్రిగా అనర్హుడని,డిఎస్సీ అక్రమాలకు ఆద్యుడని ఆరోపించారు.నిజాయితీ నిరూపించు కోవడానికి సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.డిఎస్సీ పరీక్షల నిర్వహణ,మార్కుల వెల్లడి,స్పోర్ట్స్ కోటా మరియు కాంట్రాక్ట్ ఉద్యోగులు పరీక్ష రాయడం,మెరిట్ లిస్ట్ ప్రకటించక పోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు.మెరిట్ లిస్ట్ మాయం,స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు ఉద్యోగాలను అమ్ముకున్నారనే ఆరోపణలు వచ్చాయని వాటిపై విద్యా శాఖ మంత్రిగా నారా లోకేష్ స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.నారా లోకేష్ బాబుపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో రాజీనామా చేసి విచారణ కోరే దమ్ముందా అని సిఎం చంద్రబాబునాయుడుకి సవాల్ విసిరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి డిఎస్సీ పరీక్ష రాసి ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకోవడం, అతన్ని ఉద్యోగం నుంచి తొలగించడం,మెరిట్ లిస్ట్ మాయం చేయడం,స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని,డిఎస్సీ అక్రమాల ద్వారా నిజమైన,నిరుపేద,కష్టపడి పరీక్ష రాసిన వారికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికే సుమారు రెండు వందల మంది కోర్టును ఆశ్రయించారని, అవకతవకలకు ఇదే నిదర్శనమన్నారు.ఈ కార్యక్రమంలో మేధావుల ఫోరం స్టేట్ జాయింట్ సెక్రెటరీ మయూరి రఘునాథరెడ్డి, యువజన విభాగం స్టేట్ జాయింట్ సెక్రటరీ కిషోర్ కుమార్ రెడ్డి,రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి లియాఖత్ అలీ,ఖాదర్ వలి,హేమంత్,పవన్,మిద్దింటి కిషోర్,వలసపల్లి నాగరాజ రెడ్డి,కొత్తవారిపల్లి మహేష్,శరత్ రెడ్డి,మజ్జిగ కేశవ యాదవ్,అశోక్ రాయల్,రామసముద్రం మండల యువజన విభాగం అధ్యక్షులు బాలాజీ,మహమ్మద్ యూనిస్,ఫిరోజ్, ఆనంద్ రెడ్డి,పీలేరు దావూద్,చక్రి, గౌతం, భాస్కర్, వాసు దేవ్రెడ్డి,రాజా, అభి,సాయి, దీపు,పూర్ణ,చౌడేపల్లి కల్యాణ్,శారదా రెడ్డి, షెహనాజ్,నాగమణి పాల్గొన్నారు.

## నివాస పట్టాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతి



**పీలేరు, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీలేరు పట్టణం బిఎస్ఎన్ఎల్ ప్రభుత్వ కార్యాలయం ఎదురుగా ఉన్న సర్వే నెం : 139 లో ఇంటి నివాస పట్టాలు మంజూరు చేయాలని సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లి కలెక్టర్ కార్యాలయం నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారం వేదిక నందు బాధితులతో కలసి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఎస్సీ సంఘ నాయకులు మాట్లాడుతూ పీలేరు పట్టణం బిఎస్ఎన్ఎల్ ప్రభుత్వ కార్యాలయం ఎదురుగా సర్వే నెం : 139 లో సుమారు ఆరు కుటుంబాల వారు గత 60 సంవత్సరాలనుండి నివసిస్తూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు గతంలో జిల్లా కలెక్టర్ల గారికి,అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించగా స్పందించిన జిల్లా కలెక్టర్ పీలేరు రెవిన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేయగా హుటాహుటిన సర్వేయర్ మరియు వీఆర్వో సర్వే చేసి ఇంటి నివాస పట్టాలు మంజూరు చేస్తామని చెప్పి నెలలు గడుస్తున్న ఇంతవరకు బాధిత కుటుంబాల వారికి ఎలాంటి పట్టాలు మంజూరు చేయలేదు చేయలేదు ఇలా కాలం గడుస్తున్న తరుణంలో ఇటీవల కాలంలో పీలేరు గ్రామపంచాయతీ ఈవో హఠాత్తుగా వచ్చి అక్కడ నివసిస్తున్న కుటుంబీకులను వెంటనే ఈ స్థలాన్ని ఖాళీ చేసి వెళ్ళాలని తెలిపారు ఐతే ఉన్న ఫలానా స్థలాన్ని ఖాళీ చేయమంటే ఇంటిలోని పిల్లలను, పెద్దలను, తీసుకొని ఆ కుటుంబాలు ఎక్కడ తల దాచుకోవాలో తెలియని అయోమయ పరిస్థితిలో కుటుంబాలు ఉన్నాయి ఇంటిలోని ఆడవారు ఇండ్లలో పాచి పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటూ కూలి పనులకు పోతే గాని ఇల్లు గడవని పరిస్థితిలో ఉన్న ఆ కుటుంబాలపై దయచూపి సర్వే నెం 139 లో ఆ కుటుంబాలకు ఇంటి నివాసపట్టాలు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు గతంలో ఎంతో విలువచేసే పంచాయతీ స్థలాన్ని బడా బాబులు,నాయకులు, కబ్జాకు పాల్పడితే కానరాని ఇ.వో. ఇప్పుడు ఆ కుటుంబాలకు నిలువ నీడ లేకుండా చేస్తున్న పీలేరు ఈ.ఓ .ప్రవర్తన పలు అనుమానాలను రేకెత్తించే విధంగా ఉందని ఆగ్రహించారు ఇ.ఓ. ప్రవర్తనలో మార్పు లేకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎంఎస్‌పి నాయకులు నడిమికండ్రిగ సుధాకర్ బాబు, మాలమహానాడు నాయకులు తుమ్మల ధరణ్ కుమార్, జెట్టి మల్లికార్జున,ఎంఎస్‌పి మండల నాయకులు సద్దల శ్రీకాంత్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నగిరిపల్లిలో ఎమ్మెల్యేచే పింఛన్ల పంపిణీ



**కలికిరి,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం కలికిరి మండలం నగిరిపల్లిలో జూన్ 1న జరిగిన "ఎన్టీఆర్ భరోసా" పెన్షన్ పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది. పీలేరు శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ అందించారు. ఉదయం ఆరు గంటలకే నగిరిపల్లికి చేరుకున్న ఎమ్మెల్యే, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పెన్షన్ సొమ్మును వారి చేతికే అందించారు. "ఇది ప్రభుత్వం ఇస్తున్న భరోసా. మీ కష్టాల్లో మేము తోడుగా ఉంటాం. ఏ అవసరం వచ్చినా నేరుగా నన్ను కలవండని లబ్ధిదారులకు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.4 వేలకు పెంచి, ఒకటో తారీఖునే ఇంటి వద్దకు అందిస్తున్నాం. గత ప్రభుత్వంలో పెన్షన్ కోసం పడిగాపులు కాయాల్సి వచ్చేది. కానీ మన ప్రభుత్వంలో తెల్లవారక ముందే మీ గుమ్మం ముందు పెన్షన్ ఉంటుంది. ఇదే కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు నిదర్శనమని స్పష్టం చేశారు.నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న "ఎన్టీఆర్ భరోసా" పెన్షన్ పథకాన్ని సంబంధిత సచివాలయ సిబ్బంది సాయంత్రం లోపు 100% పూర్తి చేయాలని సూచించారు.పెన్షన్ అందుకున్న వృద్ధులు, వితంతువులు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర జంగమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వాసు నూరి చంద్రశేఖర్, కలికిరి మండల అధ్యక్షులు షాబుద్దీన్, మండల ఎంపీడీవో భానుమూర్తి, మండల మైనార్టీ అధ్యక్షులు మహల్ మున్వర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలతి, కొటాల చల్లయ్య, రెడ్డయ్య మల్ రెడ్డి, వాటర్ షెడ్ రవి, వెంకటపతి, రమణ కొండ్రు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు, నల్లారి అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మిట్స్ వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరికి సతీవియోగం

**- యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థుల దిగ్భ్రాంతి**



**మదనపల్లె, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వ్యవస్థాపకులు మరియు ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి సతీమణి,మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నాదెళ్ల లక్ష్మీరాజ్యం సోమవారం ఉదయం అనారోగ్య కారణాలతో ఆకస్మికంగా మృతిచెందారని యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు.ఆమె మరణ వార్త మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ కుటుంబ సభ్యులను,అధ్యాపకులు, సిబ్బందిని,విద్యార్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.విద్యా సంస్థ అభివృద్ధి,పరిపాలనా వ్యవహారాలు మరియు విద్యార్థుల సంక్షేమం కోసం ఆమె అందించిన సేవలు,సహకారం చిరస్మరణీయమని యూనివర్సిటీ యాజమాన్యం పేర్కొంది.నాదెళ్ల లక్ష్మీరాజ్యం అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత మదనపల్లె సమీపంలోని ఋషి వ్యాలీ క్రాస్ వద్ద ఉన్న మిట్స్ ఫార్మ్‌హౌస్‌లో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ప్రతినిధులు, యాజమాన్యం, అధ్యాపకులు,బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు నాదెళ్ల లక్ష్మీరాజ్యం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరికి మరియు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## డీఎస్సీపై వైసిపి నాయకుల దుష్ప్రచారం

**- టీడీపీ పట్టణ అధ్యక్షులు నాదెండ్ల అరుణ్ తేజ**

**మదనపల్లె, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** యువతపై వైఎస్సార్సీపీ పార్టీ కుట్రలు జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేకపోయారని,కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకుపైగా టీచర్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేస్తే ఓర్వలేని గొడ్డలి పార్టీ విష ప్రచారం చేస్తోందని మదనపల్లి పట్టణ టిడిపి అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్ తేజ ఆరోపించారు.ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతిభతో కష్టపడి ఉద్యోగాలు సాధించిన 16 వేల మంది టీచర్లను వైసీపీ అనుమానిస్తోందన్నారు.జ్యాబ్ క్యాలెండరు విడుదల చేయకుండా రాష్ట్ర యువతను మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు.మెగా డీఎస్సీ 2025కు మాత్రమే కాదు,దేశవ్యాప్తంగా జరిగే ప్రతిష్టాత్మక పరీక్షలు అన్నింటికీ టీసీఎస్ ఐయాన్ సిబిటీ వ్యవస్థనే ఉపయోగిస్తున్నారని గుర్తుచేశారు.ఎందుకంటే ఇందులో 256 బిట్ ఎన్ క్రిప్షన్,మల్టీ లెవెల్ సెక్యూరిటీ,పూర్తి ఆడిట్ ట్రయల్స్,సర్వర్ లాగ్స్,యూజర్ ట్రేసబిలిటీ వంటి అత్యాధునిక భద్రతా ప్రమాణాలు ఇందులో ఉన్నాయి.వీటి గురించి జగన్ కు చెప్పినా,చదువుకోలేదు కాబట్టి అర్థం చేసుకోలేదని ఎద్దేవా చేశారు.



# అన్నమయ్య జిల్లా

## మిట్స్‌లో ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం

**- హాజరైన ఎన్.సి.సి ఎయిర్ వింగ్ కేర్ టేకింగ్ ఆఫీసర్ చరణ్ కూచి**




**మదనపల్లె/ కురబలకోట, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు ఎన్.సి.సి ఎయిర్ వింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పొగాకు రహిత దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్.సి.సి ఎయిర్ వింగ్ కేర్ టేకింగ్ ఆఫీసర్ చరణ్ కూచి మాట్లాడుతూ పొగాకు వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి అవగాహన పెంచడం మరియు విద్యార్థులు,అధ్యాపకులు సమాజంలో పొగాకు రహిత జీవనశైలిని ప్రోత్సహించడం ముఖ్యమని ఆయన అన్నారు.ఆరోగ్యకరమైన జీవనానికి రాయబారులుగా మారాలని మరియు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండేలా వారి సహచరులను మరియు కుటుంబ సభ్యులను ప్రభావితం చేయాలని ఆయన విద్యార్థులకు తెలిపారు.యువత మార్పుకు మార్గదర్శకులు అని పొగాకు రహిత తరం ఆరోగ్యకరమైన జీవనానికి నాంది అన్నారు.సిగరెట్ తాగడం,పొగాకు నమలడం,రెండు రూపాలు సమానంగా ప్రాణాంతకమని,ఒకే తేడా ఏమిటంటే ధూమపానం ప్రభావాలు మొత్తం శరీరంపై త్వరగా కనిపిస్తాయని,అయితే పొగలేని పొగాకు నోరు,గొంతు నుండి ప్రారంభించి శరీరాన్ని నెమ్మదిగా నాశనం చేస్తుందన్నారు.పొగాకు ఏ రూపంలో వినియోగించినా అది గుండె,ఊపిరితిత్తులు మరియు శరీరంలోని ప్రతి కణాన్ని ప్రభావితం చేస్తుందన్నారు.దానిని వదిలివేయడమే ఉత్తమ పరిష్కారమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్న మోసంపై ఎస్పీకి ఫిర్యాదు



**మదనపల్లె, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తండ్రి వీలునామాగా రాసి ఇచ్చిన భూమిని అన్న సురేంద్ర అక్రమంగా కబ్జా చేసి మోసం చేశాడని బాధితుడు చిన్నప్ప సోమవారం జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లికి ఫిర్యాదు చేశాడు. ఎస్పీ కార్యాలయం ముందు బాధితుడు చిన్నప్ప మాట్లాడుతూ బి. కొత్తకోట మండలం గొల్లపల్లి పంచాయతీ, చిట్టెంరెడ్డిగారి పల్లెకు చెందిన వెంకటప్ప, వెంకటమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు వెంకట్రమణ, సురేంద్ర, చిన్నప్ప లు ఉన్నామన్నారు. మా తండ్రి వెంకటప్ప రెక్కల కష్టంతో 5 ఎకరాల వ్యవసాయ పొలాన్ని కొనుగోలు చేశాడని తెలిపాడు. ఈ క్రమంలో పెద్ద కుమారులు వెంకటరమణ, సురేంద్ర లు తల్లిదండ్రుల బాగోగులు చూసుకోక పోవడంతో చిన్న కుమారుడైన తాను తల్లిదండ్రులను పోషించానని చెప్పాడు. తనకి పెద్దగా లోకజ్ఞానం లేకపోవడంతో తండ్రి వెంకటప్ప సంపాదించిన ఐదెకరాల వ్యవసాయ పొలాన్ని తన పేర వీలునామాగా రాసి రిజిస్టర్ చేశాడని చెప్పాడు. ఇదిలా ఉండగా తల్లిదండ్రులు మరణించిన అనంతరం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే అన్న సురేంద్ర తనకు తెలియకుండా మాతండ్రి నాకు రాసిచ్చిన పొలాన్ని రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అతని పేరుమీద రిజిస్టర్ చేయించుకుని కబ్జా చేశాడని ఆరోపించాడు. ఆలస్యంగా విషయం తెలియడంతో న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నానని, ఈ క్రమంలో ఎస్పీ కలిసి అన్న మోసం పై ఫిర్యాదు చేశానని చెప్పాడు. అధికారులు తనకు న్యాయం చేయాలని చిన్నప్ప అభ్యర్థిస్తున్నాడు.

## గ్యారంపల్లి గురుకులం ప్రిన్సిపాల్‌గా డా. చెన్నకేశవులు బాధ్యతల స్వీకరణ

**- విద్యా ప్రమాణాల పెంపు, 100 శాతం ఫలితాల సాధనకు కృషి చేస్తానని హామీ**



**కంభం వారిపల్లి, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాలలో బొటనీ లెక్చరర్‌గా విశిష్ట సేవలందించిన డాక్టర్ చెన్నకేశవులు పదోన్నతి పొంది సోమవారం గ్యారంపల్లిలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాలలో రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది నూతన ప్రిన్సిపా ల్‌కు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం డాక్టర్ చెన్నకేశవులు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కళాశాలలో గతంలో సాధించినట్లుగానే ఉత్తమ విద్యా ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని, 100 శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా అధ్యాపక బృందంతో సమన్వయంగా పనిచేస్తానని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజన సదుపాయాలు అందించడంతో పాటు కళాశాల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని వెల్లడించారు. కళాశాల భద్రతా పరిరక్షణ దృష్ట్యా త్వరలోనే ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.కాగా, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ ఆంజనేయులు పదోన్నతి పొంది వెంకటగిరి గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన సేవలను ఈ సందర్భంగా సిబ్బంది స్మరించు కున్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొని నూతన ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## కృషి విజ్ఞాన కేంద్రంలో కేత్ బచావో అభియాన్




**కలికిరి,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కృషి విజ్ఞాన కేంద్ర, కలికిరి నందు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ , భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి వారి సూచన మేరకు సోమవారం పొలాల సంరక్షణ పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవికె, కలికిరి సమన్వయకర్త, డాక్టర్ కె. మంజుల మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుండి 30 తేదీ వరకు నేల సంరక్షణకు రైతులు పాటించాల్సిన వివిధ పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అన్నమయ్య,చిత్తూరు జిల్లాలలో వివిధ మండలాల్లోని గ్రామాలలో అవగాహన , శిక్షణ కార్యక్రమాల ద్వారా నిర్వహిస్తామని తెలిపారు. రైతులు పంటలు వేసేముందు పచ్చి రొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చి రొట్టె పంటలను పెంచి దుక్కిలో కలియ దున్నాలని తెలిపారు. దీనివల్ల ఎకరాకు 25% నుంచి 30% రసాయన ఎరువులను తగ్గించవచ్చని తెలిపారు. నేలలో సేంద్రీయ కర్బనం పెరిగి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హార్సిలీహిల్స్, అటవీశాఖ శిక్షణ అధికారి శ్రీ శివకుమార్ గారు సీడ్ బాల్స్ తయారీ మరియు ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. బీడు భూములు, కొండ ప్రాంతాలలో పచ్చదనం పెంచడానికి సీడ్ బాల్స్ అద్భుతమైన పద్ధతని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, వానపాముల ఎరువు మరియు పశువుల ఎరువు వివిధ పంటల్లో ఏవిధంగా వాడాలని కృషి విజ్ఞాన కేంద్రం, శాస్త్రవేత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి వ్యవసాయ కళాశాల అధ్యాపకురాలు నాగమణి, కెవికె శాస్త్రవేత్తలు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆదినారాయణ, ఇతర కె.వి.కె సిబ్బంది, వివిధ మండలాల నుంచి వచ్చిన 15 మంది రైతులు, తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# గొల్లపూడి వాటర్ ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



**విజయవాడ , జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. గొల్లపూడిలోని వాటర్ ఫిల్టర్ బెడ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిల్టర్ బెడ్ పనితీరు, నీటి శుద్ధి ప్రక్రియ (ప్యూరిఫికేషన్ ప్రాసెస్) గురించి అక్కడి అధికారులను, ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గొల్లపూడి నుండి జక్కంపూడి వద్ద నూతనంగా నిర్మించిన టిడ్కో గృహాలకు త్వరలోనే సురక్షితమైన కృష్ణా జలాలను సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, ఫిల్టర్ బెడ్ నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న నీటి శుద్ధి ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఒక్కొక్క ఉద్యోగాన్ని 15 లక్షలకు అమ్ముకున్న కూటమి ప్రభుత్వం

### మెగా డీఎస్సీ లోలి జరిగిన అవకతవకలపై లోకేష్ మంత్రి పదవికిలి లిరాజీనామా చెయ్యాలి




పల్నాడు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్‌లి లిపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లి గోపిరెడ్డి శ్రీనివాస్రెడ్డి

**పల్నాడు జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ లో జరిగిన అవకతవకలపై స్థానిక పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి మెగాడీఎస్ లో జరిగిన అవకాతవకలపై కలెక్టర్ కి వినతిపత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి మరియు రాష్ట్ర ,జిల్లా, నియోజకవర్గ మరియు పట్టణ యూత్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ పూర్తి అవకతవకల మయమని, అవినీతితో నిండిపోయిందని ..మెరిట్ లిస్టులో ఉన్న టీచర్లకు ఉద్యోగాలు ఇవ్వకుండా లక్షల రూపాయలకు దొడ్డి దారిన ఉద్యోగాలు అమ్ముకున్నారని... మీరు నిజాయితీగా డీఎస్సీ నిర్వహిస్తే మెరిట్ లిస్టు ఎందుకు ప్రకటించలేదని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు? కేవలం ఉద్యోగాలు వచ్చిన వారికే ఎస్ఎంఎస్ మెసేజ్లు పంపించి వారిని ఉద్యోగాలలో జాయిన్ చేసుకున్నారని, గత వైఎస్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో చిన్న ఉద్యోగం ఇచ్చిన వారం రోజుల ముందు మెరిట్ లిస్టు ప్రకటించామని, మీరు ప్రస్తుతం మెరిట్ లిస్టు లేకుండా ఇన్ని వేల ఉద్యోగాలు ఎలా ప్రకటించారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రశ్నించారు ? స్పోర్ట్స్ కోటాలో సుమారు 420 ఉద్యోగాల్ని ఒక్కొక్క ఉద్యోగం 15 లక్షల చెప్పుకున్న మీరు అమ్ముకున్న మాట వాస్తవం కాదా? లోకేష్ గారు... అని ప్రశ్నించారు! కేంద్రం ప్రకటించిన స్పోర్ట్స్ కోటాలో అర్హులైన శ్రీకాకుళం జిల్లాకు చెందిన వాసులకు ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదని సూటిగా ప్రశ్నించారు ? క్రీడా మైదానం అంటే ఏమిటో తెలియని వాళ్లకు కూడా లక్షలాది రూపాయల డబ్బులు తీసుకొని ఉద్యోగాలు అమ్ముకున్నారని, ఇది అవినీతి కాదా ?అని ప్రశ్నించారు! లోకేష్ బాబు .....నీకు దమ్ము, ధైర్యం ఉంటే డీఎస్సీలో జరిగిన అవకతవకలపై ప్రజల ముందుకు వచ్చి దగాపడ్డ నిరుద్యోగ యువతకు సమాధానం చెప్పాలని... తప్పు చేసింది నీవైతే ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ చేత ఎలా ప్రెస్ మీట్ పెట్టిస్తావని ...సమాధానం చెప్పాల్సిన బాధ్యత నీదేనని.. ఉద్యోగాలు అమ్ముకున్నది నీవేనని.. ఉద్యోగాలు నీవు అమ్ముకుంటే ప్రభుత్వ అధికారి ఎలా సమాధానం చెబుతాడని.. నీకు సమాధానం చెప్పే దమ్ము ధైర్యం లేదా అని ప్రశ్నించారు? డీఎస్సీ మీద అవకతవకలపై ప్రశ్నిస్తున్నందుకే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారిపై కేసులు పెట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, ప్రజలకు అన్ని విషయాలు తెలుస్తున్నాయని, ఈ సందర్భంగా తెలియజేస్తూ ... పది సంవత్సరాలుగా టీచరు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ మెరిట్ లిస్టులో ఉన్నవారు ఉద్యోగాలు కోల్పోయారని, తక్షణమే మెరిట్ లిస్టు ప్రకటించి డీఎస్సీ రాసిన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు .డీఎస్సీ లో జరిగిన అవకతవకలపై తక్షణమే సిబిఐ దర్యాప్తు లేదా రిటైర్డ్ హైకోర్టు జడ్జి చేత విచారణ జరిపించాలని, డిఎస్సి లో జరిగిన భారీ అవకతవకలపై ప్రభుత్వ అధికారి ప్రెస్ మీట్ పెట్టి సమాధానం చెబితే సరిపోదని, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నువ్వే ప్రజల ముందుకు వచ్చే సమాధానం చెప్పాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారిని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు మరియు నిరుద్యోగయి యువత భారీగా పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ లో 65 ఫిర్యాదులు నమోదు



**పల్నాడు జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ జే వి సంతోష్ పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక,ఆస్తి తగాదాలు,మోసం మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 65 ఫిర్యాదులు అందాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

# మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థలో 1318 రకం విత్తనాలు పంపిణీ



**ఆచంట జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అధిక ఉష్ణోగ్రతల కారణంగా వాయిదా పడిన ఎంటియూ 1318 రకం విత్తనాల అమ్మకాలను మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ సోమవారం నుండి తిరిగి ప్రారంభించింది. సంస్థ సహ సంచాలకులు సి. హెచ్. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం, విత్తనాలు కోరుకునే రైతులు ఉదయం 9:00 నుండి 11:30 వరకు, మరియు మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు పరిశోధన సంస్థ వద్ద కొనుగోలు చేయవచ్చు. ఈ సమాచారాన్ని ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.

# విద్యార్థులకు శుభవార్త: డైట్ ఛార్జీల పెంపునకు ఏపీ ప్రభుత్వం కసరత్తు!



**విజయవాడ , జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 6.52 లక్షల మంది విద్యార్థులకు మరింత నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. ఇందులో భాగంగా విద్యార్థుల డైట్ ఛార్జీలను పెంచేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.ప్రస్తుతం ఈ ఛార్జీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 990 కోట్లు ఖర్చు చేస్తోంది. తాజాగా దీనిని 10% లేదా 15% మేర పెంచాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 10% పెంచితే: ఏడాదికి అదనంగా రూ. 99 కోట్లు భారం పడుతుంది. 15% పెంచితే: అదనంగా రూ. 148 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఈ ప్రతిపాదనలపై వారం లేదా పది రోజుల్లో ప్రభుత్వం నుండి తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. అంతా అనుకూలిస్తే ఈ ఏడాది జూన్ లేదా జులై నెలల నుంచి పెరిగిన డైట్ ఛార్జీలు అమలులోకి రానున్నాయి.ప్రభుత్వ నిర్ణయంతో హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకునే లక్షలాది మంది విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందనుంది.

# కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్ఎస్ లో 152 అర్జీలు స్వీకరణ

### జిల్లా రెవిన్యూ అధికారి నారదముని



**పల్నాడు జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లా కలెక్టరేట్ లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు, జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా రెవిన్యూ అధికారి నారదముని అర్జీలను స్వీకరించారు. – ఈ సందర్భంగా ప్రజల నుంచి 152 అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు క్యూ జిల్లారెవిన్యూ అధికారి ఆదేశాలు జారీ చేశారు.

– ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలను సత్వరం అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. ఆయా శాఖల అధికారులు గడువులోపు అర్జీలను పరిష్కరించడం చేయాలన్నారు. ప్రతిరోజు అర్జీలను మానిటర్ చేయాలని, గడువు తీరకముందే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చేయాలని ఆదేశించారు. అర్జీలను ఎలాంటి పెండింగ్ ఉంచరాదని, పెండింగ్ ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ అర్జీలను ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని ఆదేశించారు.

# పంట బోదుల్లోకి దిగి ఉపాధి శ్రామికులకు మజ్జిగ అందజేసిన మంత్రి నిమ్మల



**పాలకొల్లు జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పాలకొల్లు మండలంలోని వేలివెల గ్రామంలో ఉపాధి హామీ శ్రామికులకు మంత్రి నిమ్మల రామానాయుడు మజ్జిగను అందజేశారు. పంట బోదుల్లోకి దిగి అందులో పనిచేస్తున్న శ్రామికులకు స్వయంగా అందజేశారు. వేసవి మండుటెండలో పనిచేస్తున్న వారికి ప్రతిరోజు మజ్జిగను దాతలు సహకారంతో తెదేపా శ్రేణులు అందజేయాలని మంత్రి నిమ్మల ఇచ్చిన పిలుపుతో గ్రామ గ్రామాన ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ప్రతి ఒక్కరితో మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ మీకు ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. స్వచ్ఛమైన పల్లెల్లో మంచి మనసుతో మెలిగే ప్రజలంటే తనకు మమకారం అని, ఆ ఉద్దేశంతోనే గత ఏడాది వేసవిలో మజ్జిగను అందజేయడంతో శ్రామికులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారని, దీంతో ఈ ఏడాది కూడా కొనసాగేలాగా పిలుపునిచ్చానన్నారు. ఉపాధి శ్రామికులకు మజ్జిగ నా అందజేయడం తనకు ఎంతో సంతృప్తి, ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు.

# గుంతకల్లు లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**గుంతకల్లు జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గుంతకల్లు పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల సంక్షేమం మరియు సంక్షేమ పథకాల పట్ల ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 3000 నుంచి రూ. 4 వేల వరకు పింఛన్లను పెంచి లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు.

# శ్రీ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యంయల్ఏ శ్రీరాం రాజగోపాల్ కి వినతి....


### పద్మశాలి కులస్తుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన యంయల్ఏ శ్రీరాం రాజగోపాల్




**జగ్గయ్యపేట జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జగ్గయ్యపేట పట్టణ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు అల్లి లక్ష్మీ కిశోర్,కార్యదర్శి భారత జగన్ ల ఆధ్వర్యంలో పద్మశాలి కులస్తుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కి వినతిపత్రాన్ని సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణంలో పద్మశాలి కులస్తులు 2000 గడపలలో నివసిస్తున్నారు .పద్మశాలి కులస్తులు జగ్గయ్యపేట పట్టణంలో శుభ కార్యక్రమాలు చేసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. కుల వృత్తిని వదులుకొని బట్టల మూట వ్యాపారం, టైలరింగ్,గుమాస్తాలుగా జగ్గయ్యపేట లో మా కులస్తులు పని చేసుకుంటున్నారు. పాత గడ్డ ప్రాంతంలో పద్మశాలి వంశీయులు ఎక్కువగా ఉన్నందున వారి కుల వృత్తికి సంబంధించిన రాట్రాని, మార్కండేయ విగ్రహ ఏర్పాటుకు అవకాశం కల్పించాలి. స్మశాన వాటిక ప్రకృతి విలయ తాండవంతో స్మశానం పాడైపోయి ఇబ్బందులు పడుతున్నారు. పద్మశాలీ కులస్తులను దృష్టిలో ఉంచుకొని ఫంక్షన్ హాలు కి స్థలాన్ని కేటాయించాలని, కుల ధృవీకరణ ఆధారంగా 50 సంవత్సరాలు దాటిన వారికి చేనేత ఫించన్ ఇప్పించగలరని, పాడైన స్మశాన వాటికకు ప్రభుత్వం నుండి బడ్జెట్ ని కేటాయించి పునః నిర్మాణం చేయాలని, పద్మశాలి వంశీయులు రాష్ట్రంలో అధికార పార్టీ వెంబడే ఉన్నందున, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వర్యులు శ్రీయుత నారా లోకేష్ మంగళగిరిలో పద్మశాలి కులస్తులను ఆదుకుంటున్న విధంగా జగ్గయ్యపేట పట్టణం లో కులస్తులను తమరు ఆదుకొని పై విషయాల పరిష్కరించి న్యాయం చేయాలని కోరాడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్(తా తయ్య) కుల సంఘం వారితో పద్మశాలి కులంలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ని,ఇన్ ఛార్జి కమీషనర్ శివ కోటేశ్వరరావు ని కలవడం జరిగింది. ఈ కార్యక్ర మంలో కుల పెద్దలు మేక వెంకటేశ్వ ర్లు,యేశాల సీతారామమూర్తి,పెనుమల్లి చంద్రమౌళి, గోసిక శ్రీనివాసరావు,చెరుపల్లి నాగరాజు,గజ్జం నాగశివ రాం,యం శ్రీనివాసరావు,వివి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ జీవితం ఆదర్శనీయం

### ఎంఈవో విజయకుమారి పదవీ విరమణ సభలో మంత్రి కొండపల్లి



**విజయనగరం జూన్ 1 (మెట్రో వాయిస్ న్యూస్)** ఉపాధ్యాయ జీవితం ఆదర్శనీయమైనదని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని రామవరం సూర్యా ఫంక్షన్ హాల్ లో జరిగిన మండల విద్యాశాఖ అధికారి 1 గా పనిచేసి పదవీ విరమణ చేస్తున్న బంటు విజయ కుమారి అభినందన సభ కార్యక్రమంలో పాల్గొన్నారు. విజయకుమారిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ఉద్యోగాలన్నింటిలో ఉపాధ్యాయ వృత్తి బాధ్యతయుతమైనదని, నేటి సమాజంలో రాజకీయ, చిత్ర రంగ, పలు ఉద్యోగాలలో రాణిస్తున్న విద్యార్థులను తయారు చేసే సత్తా ఒక ఉపాధ్యాయ వృత్తికే ఉన్నదన్నారు. విజయ కుమారి ఉద్యోగ విధులలో ఎంతో బాధ్యతయుతంగా పనిచేస్తారని, విధులలో అలసత్వం నిర్వహించే వారి పట్ల ఎంతో కఠినంగా వ్యవహరించే వారని, క్రమశిక్షణతో సమయపాలన పాటించాలని తమ క్రింది స్థాయి ఉద్యోగులకు సూచించేవారని ఆమె వ్యక్తిత్వం, దృఢ సంకల్పం సమాజానికి దిక్సూచిని కలగ చేస్తుందని మంత్రి ఆమె సేవలను కొనియాడారు. పదవి విరమణ అనంతరం ఆమె శేష జీవితం ఆరోగ్యంగా, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి కొండపల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఉపాద్యాయ శాసన మండలి సభ్యులు గాదె శ్రీనివాసులనాయుడు పలువురు ఉపాద్యాయులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట



**వలూరు జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్రంలో మహిళలను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. సోమవారం కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం పరిధిలోని చంద్రబాబు నాయుడు కాలనీలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహానాడులో ప్రకటించిన 33శాతం రిజర్వేషన్‌తో మహిళలకు అత్యున్నత ప్రాధాన్యత లభిస్తుందని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో కోవూరు నియోజకవర్గానికి రూ. 13 వేల కోట్ల పెట్టుబడులతో భారీ పరిశ్రమలు రాబోతున్నాయని తెలిపారు. దీనివల్ల స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. నిరుద్యోగ నివారణకు ఇప్పటికే 16 వేల పోస్టులతో 'మెగా డీఎస్సీ' ప్రకటించామని చెప్పారు. కాగా, ఇళ్ల స్థలాల కోసం స్థానికులు సమర్పించిన అర్జీలపై ఎమ్మెల్యే తక్షణమే స్పందిస్తూ.. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని అక్కడికక్కడే తహసీల్దార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, రెవెన్యూ అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఏఎస్పి



**పుట్టపర్తి జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పుట్టపర్తిలోని ఏఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత సురాణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి, సంబంధిత అధికారులకు పంపి, సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## అక్కినేని కోడలు విమర్శలను జయిస్తుందా?



ఇంట గెలిచి రచ్చ గెలవాలి అని ఒక సామెత. కొందరు మాత్రం రచ్చ గెలిచి, తర్వాత ఇంటికి వస్తుంటారు. శోభిత ధూళిపాళ్ల ఈ కోవకే చెందుతుంది. ఈ వైజాగ్ అమ్మాయి నేరుగా బాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చి అక్కడ మంచి పేరు సంపాదించింది. అక్కడ ఆమె చేసిన సినిమాలు, వెబ్ సిరీస్‌లు విజయవంతం అయ్యాయి. తర్వాత 'గూఢచారి' చిత్రంతో ఆమె సొంత ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఆపై 'మేజర్' మూవీలోనూ తళుక్కుమంది. తెలుగులో నటిస్తూనే తమిళంలో లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం ప్రెస్టీజియస్ మూవీ 'పొన్నియన్ సెల్వన్'లో అవకాశం దక్కించుకుంది. ఐతే అందులో శోభిత చేసిన రాణి పాత్ర విషయంలో తీవ్ర విమర్శలు తప్పలేదు. రాణిగా ఆమె లుక్స్ ఏమాత్రం సూట్ కాలేదు. నటన విషయంలోనూ విమర్శలు వచ్చాయి. 'పొన్నియన్ సెల్వన్' సినిమానే చాలా ట్రోలింగ్ ఎదుర్కోగా.. శోభిత మీద మరింత ఎక్కువ నెగెటివిటీ కనిపించింది. మామూలుగా మణిరత్నం సినిమాలో నటించిన కథానాయికకు ఆ చిత్ర ఫలితంతో సంబంధం లేకుండా తర్వాత అవకాశాలు వరుస కడతాయి. కానీ శోభిత మాత్రం చాలా ఏళ్ల పాటు తమిళంలో మరో అవకాశం అందుకోలేకపోయింది. కానీ అక్కినేని నాగచైతన్యను పెళ్లి చేసుకుని, మొత్తంగా సినిమాలు తగ్గించేసుకున్న టైంలో ఒక స్పెషల్ మూవీలో ఛాన్స్ అందుకుంది శోభిత. తమిళంలో కొత్త తరం గ్రేట్ డైరెక్టర్లలో ఒకడిగా పేరు సంపాదించిన పా.రంజిత్ దర్శకత్వంలో శోభిత నటిస్తోంది. దినేష్, ఆర్య ముఖ్య పాత్రలు పోషిస్తున్న 'వేట్టువం' చిత్రంలో శోభితనే కథానాయికగా నటిస్తోంది. పా.రంజిత్ చిత్రాల్లో సోకాల్డ్ హీరోయిన్ పాత్రలు ఉండవు. లేడీ క్యారెక్టర్లు కూడా హీరోకు దీటుగా నిలుస్తాయి. ఎక్కువగా గ్రామీణ నేపథ్యంలో సినిమాలు చేసే రంజిత్.. ఈసారి అర్బన్ బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా చేస్తున్నాడు. ఇందులో శోభిత కూడా మోడర్న్ గర్ల్ రోలే చేస్తోంది. తన ఫస్ట్ లుక్‌ను తాజాగా లాంచ్ చేశారు. తన పాత్ర కచ్చితంగా కెరీర్లో ప్రత్యేకంగా నిలిచిపోయేదిగా ఉంటుందని భావిస్తున్నారు. 'పొన్నియన్ సెల్వన్'తో వచ్చిన విమర్శలన్నింటికీ ఈ సినిమాతో శోభిత బదులిస్తుందనే అంచనాలున్నాయి. ఈ సినిమా చిత్రీకరణలోనే ఒక ఫైట్ మాస్టర్ ప్రాణాలు కోల్పోవడంతో 'వేట్టువం' ఇంతకుముందు వార్తల్లో నిలిచింది. చిత్రీకరణ చివరి దశలో ఉన్న ఈ సినిమా ఈ ఏడాది ద్వితీయార్ధంలో ప్రేక్షకుల ముందుకు వస్తుంది

## అర్జున్ మార్కెట్ బ్రతికే ఉంది



ఒకప్పుడు యాక్షన్ కింగ్ గా మాస్ ప్రేక్షకులకు బాగా దగ్గరైన హీరో అర్జున్. తెలుగులో మా పల్లెలో గోపాలుడు లాంటి హిట్లు చాలానే ఉన్నప్పటికీ జెంటిల్ మెన్ తర్వాత అయన ఇమేజ్, మార్కెట్ అమాంతం పెరిగిపోయాయి. అప్పట్లో ఒకే ఒక్కడుకి తమిళనాడులో కంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే ఎక్కువ కలెక్షన్లు వచ్చిన విషయాన్ని ట్రేడ్ గుర్తు చేసుకుంటూ ఉంటుంది. ఇంత వయసు వచ్చినా బాడీ ఫిట్ నెస్ విషయంలో కుర్రాళ్లతో పోటీ పడటం ఆయన ప్రత్యేకత. అలాంటి అర్జున్ చాలా సంవత్సరాలుగా సపోర్టింగ్ రోల్స్ ఎక్కువగా చేస్తున్నారు. నా పేరు సూర్యలో అల్లు అర్జున్ తండ్రిగా నటించారు. నితిన్ లై, విజయ్ లియో, అజిత్ పట్టుదలలో నెగటివ్ షేడ్స్ చేశారు. ఇక సపోర్టింగ్ క్యారెక్టర్ల జాబితా చాలా పెద్దది. మామూలుగా ఇలా కెరీర్ సెకండ్ ఇన్నింగ్స్ లో సోలో హీరోగా మళ్ళీ ట్రాక్ లోకి రావడం కష్టం. అందుకే శ్రీకాంత్, జగపతిబాబు, మోహన్ బాబు లాంటి సీనియర్లు ఎప్పుడో తమ మీదే కథ నడవాలనే రూల్ పక్కన పెట్టేశారు. కానీ అర్జున్ విషయంలో వేరే జరుగుతోంది. ఇటీవలే విడుదలైన బ్లాస్ట్ జోన్ మంచి వసూళ్లు రాబడుతోంది. కేవలం పదిహేను కోట్లతో రూపొందిన ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ ఫైనల్ రన్ అయ్యేలోపు యాభై కోట్లు దాటడం ఖాయమని ఇన్ సైడ్ టాక్. నెట్ ఫ్లిక్స్ రూపంలో పెట్టుబడి మొత్తం రిలీజ్ ముందే వెనక్కు వచ్చేసిందట. ఇప్పుడు లాభాల దిశగా వెళ్తోంది. కరుప్పు మంచి స్వింగ్ లో ఉన్నప్పుడే బ్లాస్ట్ కి ఇంత స్పందన రావడం ఊహించని పరిణామం. ఈ వారంలో పెద్ది లేకపోయి ఉంటే ఇంకా బలమైన రన్ దక్కేదేమో కానీ మొత్తానికి అర్జున్ లో సత్తా అయిపోలేదని చెప్పడానికి ఈ సినిమా బాగా ఉపయోగపడుతోంది. ఒకప్పుడు చిరంజీవి శ్రీమంజునాథ, కృష్ణవంశీ శ్రీ ఆంజనేయం, జగపతిబాబు హనుమాన్ జంక్షన్ లాంటి స్ట్రెయిట్ సినిమాలు ఎక్కువ చేసిన అర్జున్ ఇటీవలే కూతురు ఐశ్వర్యని డైరెక్ట్ చేసిన సీత పయనంని కన్నడతో పాటు సమాంతరంగా తెలుగులోనూ నిర్మించారు. కాకపోతే అనుకున్నదాని కన్నా పెద్ద ఫ్లాప్ అయ్యింది.

## అజిత్ సెట్టవ్వకపోతే.. టాలీవుడ్ హీరో..



మార్క్ ఆంటోనీ, గత ఏడాది అజిత్ తో వచ్చిన గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలతో తమిళ దర్శకుడు అధిక్ రవిచంద్రన్ కమర్షియల్ డైరెక్టర్ గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. అజిత్ తో సినిమా పూర్తయిన వెంటనే మళ్లీ అదే కాంబినేషన్ రిపీట్ అవుతుందని అందరూ అనుకున్నారు. కానీ అలా జరగలేదు. దీంతో ఈ దర్శకుడు నెక్స్ట్ ఏ హీరోతో సెట్స్ మీదకు వెళ్తాడనే దానిపై రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. అజిత్ గత ఏడాది విడాముయర్చి, గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలతో ఆడియన్స్ ముందుకు వచ్చాడు. ఆ రెండు ప్రాజెక్ట్స్ కంప్లీట్ అవ్వడంతో అధిక్ తో కొత్త సినిమా అనౌన్స్ మెంట్ వస్తుందని కోలీవుడ్ వర్గాలు భావించాయి. కానీ అజిత్ తన కొత్త లైనప్ విషయంలో ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. మొదట రెమ్యునరేషన్ విషయంలో ఆలస్యం జరిగినట్లు టాక్ వచ్చింది. ఆ తరువాత అజిత్ ఇష్టమైన రేసింగ్ కోసం దుబాయ్ వెళ్ళాడు. ఇక రీసెంట్ గా అతని మాతృమూర్తి కన్నుమూశారు. దీంతో అతను ఇప్పట్లో షూటింగ్ కి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇక అధిక్ కు ఎదురుచూపులు తప్పడం లేదు. గ్యాప్ తీసుకోవడం ఇష్టం లేని ఈ దర్శకుడు, టైమ్ వేస్ట్ కాకుండా వేరే ఆప్షన్స్ వెతుకుతున్నాడు. సరిగ్గా ఈ టైమ్ లోనే టాలీవుడ్ మాస్ స్టార్ నందమూరి బాలకృష్ణ పేరు తెరపైకి వచ్చింది. బాలయ్య ఇమేజ్ కు సరిపోయే ఒక పక్కా మాస్ కథను అధిక్ సిద్ధం చేశాడనే ప్రచారం జరుగుతోంది. ఇక యువ దర్శకులకు ఛాన్సులు ఇవ్వడానికి బాలయ్య ఎప్పుడూ ముందుంటాడు. అధిక్ యాక్షన్ టేకింగ్ బాలయ్యకు కరెక్ట్ గా సెట్ అవుతుందని, ఈ ప్రాజెక్ట్ ఓకే అయితే తెలుగులో ఒక సాలిడ్ ఎంట్రీ దొరుకుతుందని చెప్పవచ్చు. మార్కెట్ లెక్కల ప్రకారం చూస్తే అధిక్ ఫస్ట్ ఛాయిస్ కచ్చితంగా అజిత్ ప్రాజెక్ట్ కే ఉంటుంది. స్టార్ హీరోతో కోలీవుడ్ లో సినిమా చేస్తే వచ్చే క్రేజ్ వేరు. అజిత్ డేట్స్ ఇవ్వడానికి మరీ ఎక్కువ టైమ్ పడుతుంది అని క్లారిటీ వస్తేనే, టాలీవుడ్ ప్రాజెక్ట్ మీద ఫోకస్ చేసే అవకాశం ఉంది. చూడాలి మరి, మరో తమిళ దర్శకుడితో టాలీవుడ్ హీరో సెట్టవుతాడా లేదా అనేది. ప్రస్తుతం బాలకృష్ణ గోపిచంద్ మలినేనితో ఒక సినిమా చేస్తున్నాడు. మరోవైపు కొరటాల ప్రాజెక్టు కూడా లైన్ లో ఉంది.




## చరణ్ లైనప్ లో పెద్ది ఇంపాక్ట్



పెద్ది ఇప్పుడు రామ్ చరణ్ కెరీర్‌లో మరో చాలెంజ్ లాంటి ప్రాజెక్ట్ తర్వాత వచ్చిన గ్లోబల్ ఇమేజ్‌ని నిలబెట్టుకోవాలి. అదే టైమ్‌లో సోలో మార్కెట్‌ని మళ్లీ ప్రూవ్ చేసుకోవాలి. 'గేమ్ ఛేంజర్' ఫలితం అనుకున్నంతగా వర్కౌట్ కాకపోవడంతో 'పెద్ది' మీద భారం మరింత పెరిగింది. ఈ ఒక్క సినిమా చరణ్ నెక్స్ట్ 5 ఏళ్ల లైనప్‌ని డిసైడ్ చేస్తుంది. ఇప్పుడు చరణ్ టేబుల్ మీద మూడు పెద్ద పేర్లు ఉన్నాయి. ఇప్పటికే సుకుమార్ తో కాంబినేషన్ ఫిక్స్ అయ్యింది. ఇక ఆ తరువాత ప్రశాంత్ నీల్, సంజయ్ లీలా భన్సాలీ లాంటి వారితో చర్చలు జరుగుతున్నాయి. అనుకున్నట్లు కాంబినేషన్ సెట్ అవ్వాలి అంటే ముందు చరణ్ స్ట్రాంగ్ మార్కెట్ పై మరింత పట్టు సాధించాలి. సుకుమార్ 'పుష్ప'తో బ్రాండ్ అయ్యాడు. ఈ కాంబినేషన్ లో హిట్ కొట్టడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఇక నీల్ 'ఖ+ఖీ, సలార్'తో మాస్ డైరెక్టర్‌గా ఫిక్స్ అయ్యాడు. భన్సాలీతో సినిమా అంటే నేషనల్ అవార్డు రేసు. ఈ ఇద్దరిలో ఎవరితో ఫస్ట్ సెట్ అవుతాడనేది 'పెద్ది' రిజల్ట్ మీదే ఆధారపడి ఉండవచ్చు. పెద్ది హిట్ అయితే చరణ్‌కి బేరసారాల పవర్ వస్తుంది. రెమ్యునరేషన్, షేర్స్, రిలీజ్ డేట్ మీద పట్టు ఉంటుంది. కానీ ఫలితం తేడా వస్తే సీన్ రివర్స్ అవుతుంది. అప్పుడు చరణ్‌కి ఆప్షన్స్ తగ్గుతాయి. స్టార్ డైరెక్టర్లు రిస్క్ తీసుకోరు. బడ్జెట్ కంట్రోల్, సబ్జెక్ట్‌లో మార్పులు అడుగుతారు. సీనియర్ల కెరీర్‌లో ఇదివరకే ఇది చూశాం. ఒక్క ఫ్లాప్ వల్ల రెండేళ్లు వెనక్కి వెళ్లిన వారు ఉన్నారు. చరణ్‌కి ఆ పరిస్థితి రాకూడదంటే పెద్ది కచ్చితంగా ఆడాలి. ఏదేమైనా బుచ్చిబాబు ఈ ప్రెజర్‌ని హ్యాండిల్ చేస్తున్న తీరు కీలకం. 'ఉప్పెన' టైమ్‌లో ఎలాంటి అంచనాలు లేవు. ఇప్పుడు చరణ్ స్టార్‌డమ్, రెహమాన్ మ్యూజిక్, రత్నవేలు కెమెరా అన్నీ భారీగానే ఉన్నాయి. విలేజ్ స్పోర్ట్స్ డ్రామా కాబట్టి క్లాస్, మాస్ రెండింటికీ రీచ్ అవుతుంది. ఎమోషన్ వర్కౌట్ అయితే 'రంగస్థలం' తర్వాత చరణ్‌కి మరో సోలో బ్లాక్‌బస్టర్ పడుతుంది. కాబట్టి పెద్ది చరణ్ కెరీర్‌కి డైరెక్షన్ ఇచ్చే ప్రాజెక్ట్. హిట్ అయితే అనుకున్న భారీ కాంబినేషన్ ప్లాన్ స్మూత్‌గా వెళుంది. తేడా వస్తే లైనప్ మొత్తం తేడా కొడుతుంది. అందుకే ఇండస్ట్రీ మొత్తం పెద్ది ఫస్ట్ రిపోర్ట్ కోసం చూస్తోంది.



# బిజినెస్ న్యూస్



## సోలార్ దిగుమతులపై నేటి నుంచి కొత్త రూల్స్.. వినియోగదారులపై భారం



ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుందామని అనుకుంటున్నారా? అయితే, ఇకపై ఈ ప్రాజెక్ట్‌కు కాస్త ఎక్కువ ధర చెల్లించాల్సి రావొచ్చు. కొన్ని సోలార్ ప్రాజెక్ట్‌లకు దేశీయంగా తయారైన సోలార్ సెల్స్ మాత్రమే వినియోగించాలన్న నిబంధనను కేంద్ర ప్రభుత్వం తీసుకురావడమే దీనికి కారణం. చైనా నుంచి దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సూర్యరశ్మిని విద్యుత్‌గా మార్చడంలో సోలార్ సెల్స్ కీలకం. సోలార్ ప్రాజెక్ట్‌లో పలు సెల్స్‌తో కూడిన ప్యానెళ్లు లేదా మాడ్యూళ్లను ఇంటిపై/బయట ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే పలు సోలార్ ప్రాజెక్టులకు దేశీయంగా తయారైన మాడ్యూళ్లనే వాడాలనే నిబంధనను కేంద్రం తీసుకొచ్చింది. తాజాగా పీఎం సూర్యఘర్ పథకం సహా వ్యాపారులు, పరిశ్రమలు వినియోగించే ఓపెన్-యాక్సెస్ సోలార్ ప్రాజెక్టులకూ ఈ నిబంధనను విస్తరించింది. దీంతో జూన్ 1 నుంచి ప్రభుత్వ ఆమోదం పొందిన తయారీదారుల నుంచే మాడ్యూళ్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

### ఎందుకీ నిర్ణయం

దేశీయంగా సోలార్ తయారీ వ్యవస్థను బలోపేతం చేయాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం భారత్ సోలార్ ప్యానెళ్లను అసెంబుల్ చేయగలుగుతున్నప్పటికీ, వాటిలో వాడే సెల్స్ కోసం ఎక్కువగా చైనా దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. దేశంలో ప్రస్తుతం ఏటా 50+జొ సోలార్ సెల్స్ అవసరం ఉండగా.. దేశ ఉత్పత్తి సామర్థ్యం కేవలం 25-30 +జొ మాత్రమే ఉంటోంది. మిగతావి దిగుమతి చేసుకుంటున్నాం. ప్రభుత్వం తీసుకొచ్చిన 'దేశీయ' నిబంధన వల్ల మన దేశంలో సోలార్ సెల్స్ తయారీ కంపెనీలు ఎక్కువ పెట్టుబడులు పెట్టి, ఉత్పత్తిని పెంచుతాయని కేంద్రం భావిస్తోంది.

### వినియోగదారులపై భారం

ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ పెట్టుకునే వినియోగదారులపై భారం పడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దేశంలో తయారయ్యే సోలార్ సెల్స్ ధర, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వాటి కంటే ఎక్కువ. ఈ కారణంగా రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ ధర కిలోవాట్‌కు సుమారు రూ.3వేలు వరకు పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. ఒకవేళ 5 కిలోవాట్ల సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలనుకుంటే ఆ మేర రూ.15వేలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

'పీఎం సూర్యఘర్' పథకం కింద ఇచ్చే ప్రభుత్వ సబ్సిడీ యథాతథంగా కొనసాగినప్పటికీ.. ఇకపై అందుకు వాడిన ప్యానెళ్లు నిబంధనల ప్రకారం ఉన్నాయో లేదో తనిఖీ చేస్తారు. దేశీయంగా డిమాండ్‌కు సరిపడా సోలార్ సెల్స్ ఉత్పత్తి లేకపోవడం వల్ల తాత్కాలికంగా కొరత ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల చిన్న చిన్న సోలార్ కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ సవాళ్లు తాత్కాలికమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఆరంభ లాభాలు ఆవిరి.. 508 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ట్రేడైన సూచీలు.. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. దీంతో వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ సూచీలు నష్టపోయాయి. పశ్చిమాసియాలోని శాంతిపై అనిశ్చితి నెలకొనడం, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండడం స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడింది. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్ స్టాక్స్‌లో అమ్మకాలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 75,203.02 (క్రితం ముగింపు 74,775.74) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,367.93 వద్ద గరిష్ఠాలను తాకిన సూచీ.. తర్వాత నష్టాల్లోకి జారుకుంది. చివరికి 508.40 పాయింట్ల నష్టంతో 74,267.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 165.15 పాయింట్ల నష్టంతో 23,382.60 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.97గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, ఇండిగో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 94.01 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,496 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## మే నెల యూపీఐ లావాదేవీల్లో సరికొత్త రికార్డు




యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీల్లో సరికొత్త రికార్డు నమోదైంది. ఈ ఏడాది మే నెలలో రూ.29.90 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. సంఖ్యా పరంగా 2,320 కోట్ల లావాదేవీలు జరిగినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. వేసవి ప్రయాణాలకు ఐపీఎల్ సీజన్ తోడవ్వడం యూపీఐ లావాదేవీలు పెరగడానికి కారణమయ్యాయి.

ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.29.03 లక్షల కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరగ్గా.. గతేడాది మే నెలలో రూ.25.14 లక్షల కోట్ల విలువైన ట్రాన్సాక్షన్లు జరిగాయి. ఏడాదిలో 19 శాతం వృద్ధి నమోదైందని ఎన్‌పీసీఐ తెలిపింది. గతేడాది ఇదే సమయంలో 1867 కోట్లుగా ఉన్న లావాదేవీల సంఖ్య ఏకంగా 24 శాతం వృద్ధితో 2320 కోట్లకు చేరి సరికొత్త రికార్డు నమోదైందని పేర్కొంది.

వేసవి సెలవుల్లో ప్రయాణాలు, ఐపీఎల్ ఫీవర్, సీజన్ పరంగా జరిగే లావాదేవీల కారణంగా ఈ స్థాయిలో యూపీఐ లావాదేవీలు నమోదయ్యాయని క్యాష్‌ఫ్రీ పేమెంట్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ ఆకాశ్ సిన్హా పేర్కొన్నారు. ఇది నెలవారీ యూపీఐ లావాదేవీల వృద్ధిని సూచిస్తోందని తెలిపారు. 2021లో యూపీఐ సగటు లావాదేవీ మొత్తం (టికెట్ సైజ్) రూ.1848గా ఉండగా.. 2025 నాటికి రూ.1313కు తగ్గినట్లు ఆర్‌బీఐ నివేదిక ఇటీవల వెల్లడించింది. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యూపీఐ ఎకోసిస్టమ్ బలోపేతం అవుతుందనడానికి సంకేతమని ఆకాశ్ సిన్హా ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## వైవిధ్యంతో కూడిన పెట్టుబడులు




ఈక్విటీల్లో చక్కని వైవిధ్యంతో ఇన్వెస్ట్ చేసుకోవాలని భావించే వారికి మల్టీ క్యాప్ ఫండ్స్ మంచి ఆప్షన్. పెట్టుబడులకు స్థిరత్వం కోసం లార్జ్‌క్యాప్, అధిక రాబడుల కోసం మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ మధ్య పెట్టుబడులను విస్తరించడం ద్వారా దీర్ఘకాలంలో ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులను అందించేవే మల్టీక్యాప్ ఫండ్స్. ఇన్వెస్టర్లు తమ అంతటగా లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో మెరుగైన పథకాలను ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్ చేయడం కంటే మంచి మల్టీక్యాప్‌ను ఎంపిక చేసుకోవడమే చక్కని ఆప్షన్ అవుతుంది. కనీసం ఐదు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలానికి.. మధ్యస్థం నుంచి అధిక రిస్క్ తీసుకోగలిగితే ఇన్వెస్టర్లకు మల్టీ క్యాప్ ఫండ్స్ అనుకూలం.

రాబడులు.. ఈ పథకం 2023 జనవరి 30న ప్రారంభం కాగా, నాటి నుంచి ఏటా 23.4 శాతం చొప్పున రాబడిని (పాయింట్ టు పాయింట్) అందించింది. ఇదే కాలంలో మల్టీక్యాప్ ఫండ్స్ విభాగం సగటు వార్షిక రాబడి 18.3 శాతంగానే ఉంది. ఇది మెరుగైన పనితీరును తెలియజేస్తోంది. రోలింగ్ రాబడులు (వివిధ దశల్లో పెట్టుబడులు) సైతం మూడేళ్ల కాలంలో 23 శాతం చొప్పున ఉన్నాయి. మూడేళ్ల సిప్ పనితీరును గమనిస్తే ఏటా 12.8 శాతం చొప్పున రాబడి నమోదైంది. మార్కెట్లో ఎన్నో అనిశ్చితులు నెలకొన్నప్పటికీ గడిచిన ఏడాది కాల రాబడి 6.45 శాతంగా నమోదైంది. పెట్టుబడుల విధానం.. మల్టీక్యాప్ ఫండ్స్ అన్నవి లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తాయి. ఈ పథకంలో వైవిధ్యానికి ప్రాధాన్యం ఎక్కువ. ప్రస్తుతం ఈ పథకంలో 96 స్టాక్స్ ఉండడం దీన్నే సూచిస్తోంది. పోర్ట్‌ఫోలియోలోని టాప్--10 కంపెనీల్లో పెట్టుబడులు 23.19 శాతం మించలేదు. ఇది కూడా రిస్క్ వైవిధ్యంలో భాగమే. సెబీ నిబంధనల ప్రకారం అయితే మల్టీక్యాప్ ఫండ్స్ కనీసం 25 శాతాన్ని లార్జ్‌క్యాప్ కంపెనీల్లో, 25 శాతాన్ని మిడ్‌క్యాప్ కంపెనీల్లో, 25 శాతం స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. మిగిలిన 25 శాతం నిధులను మార్కెట్ పరిస్థితుల ఆధారంగా ఫండ్ మేనేజర్ తన విచక్షణ మేరకు ఎక్కడైనా ఇన్వెస్ట్ చేయొచ్చు. మార్కెట్ పరిస్థితులను బట్టి వివిధ రకాల స్టాక్స్ వేర్వేరు సమయాల్లో రాణిస్తాయి. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటున్న తరుణంలో లార్జ్‌క్యాప్ కంటే మిడ్, స్మాల్ క్యాప్ కంపెనీలు బాగా రాణిస్తాయి. అదే మార్కెట్ పతనమవుతున్న పుడు లార్జ్‌క్యాప్‌లో నష్టాలు పరిమితంగా ఉంటాయి. మల్టీ క్యాప్ ఫండ్స్ వల్ల అన్ని కాలాల్లోనూ లాభపడే అవకాశం ఉంటుంది. ఈ పథకానికి వ్యాల్యూరీసెర్చ్ సంస్థ 5 స్టార్ రేటింగ్ ఇచ్చింది.

## అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

**- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**



**తిరుపతి,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కు వచ్చిన అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీల ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీ జి ఆర్ ఎస్ లో వచ్చు అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, జిల్లా రెవిన్యూ అధికారి జి.నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివశంకర్ నాయక్, భరత్ నాయక్, రోజ్ మాండ్ లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు.

## తిరుపతి-రక్సౌల్ ఎక్స్ప్రెస్ రైలు ప్రారంభం

**- పచ్చ జెండా ఊపి ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే**




**తిరుపతి సిటీ,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దక్షిణ కోస్తా విశాఖపట్నం రైల్వే జోన్ గుంతకల్ డివిజన్ ఆధ్వర్యంలో రైలు నం. 17433/17434 తిరుపతి--రక్సౌల్ ఎక్స్ప్రెస్ రైలును తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి సోమవారం ఉదయం 8:15 గంటలకు లాంఛనంగా ప్రారంభించారు.తిరుపతి 6వ నెంబర్ ప్లాట్ఫారంపై తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే శ్రీనివాసులు, డీసీఎం, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ మోహన్ కృష్ణలు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు.గతంలో 07051/07052 ప్రత్యేక రైలుగా నడిచిన ఈ రైలును శాశ్వత రూపం కల్పిస్తూ రెగ్యులర్ ఎక్స్ప్రెస్ రైలుగా మార్చారు.ఈ రైలు తిరుపతి నుంచి బయలుదేరి రేణిగుంట, కడప, గుంతకల్, రాయచూర్, వికారాబాద్ మార్గాల ద్వారా ప్రయాణించి సాయంత్రానికి సికింద్రాబాద్ చేరుకుంటుంది. అనంతరం చర్లపల్లి, కాజీపేట, మంచిర్యాల, బిలాస్పూర్, రాంచీ, చిత్తరంజన్ తదితర ప్రధాన స్టేషన్ల మీదుగా సుమారు 2,795 కిలోమీటర్లు ప్రయాణించి రక్సౌల్ జంక్షన్ చేరుకుంటుందని గుంతకల్లు రైల్వే మండల వాణిజ్య అధికారి, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ మోహన కృష్ణ వెల్లడించారు.

## ఇ-సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహిద్దాం

**- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ మరియు ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఇ-సైకిళ్ల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవితో కలిసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇ-సైకిల్ అవగాహన కార్యక్రమం ద్వారా పెరుగుతున్న వాహనాల వినియోగంతో వాయు కాలుష్యం అధికమవుతోందని, ఇ-సైకిళ్ల వినియోగం ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంతో పాటు ఇంధన వ్యయాన్ని కూడా ఆదా చేయవచ్చని తెలిపారు.పర్యావరణ హిత రవాణా వ్యవస్థలను ప్రోత్సహించడం ద్వారా భావితరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత, ప్రభుత్వ ఉద్యోగులు మరియు ప్రజాప్రతినిధులు ఇ-సైకిళ్ల వినియోగానికి ముందుకు రావాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడే కార్యక్రమాలను పంచాయతీ రాజ్ శాఖ నిరంతరం చేపడుతోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించి ఇ-సైకిళ్ల వంటి పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని కలెక్టర్ తెలిపారు. ఇ -సైకిల్ ను వినియోగిస్తున్న పంచాయతీరాజ్ శాఖ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## టీటీడీకి రూ.11 లక్షలు విరాళం



**తిరుమల, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**దుబాయ్ కు చెందిన మనోజ్, నేహా అనే భక్తులు కలిసి సోమవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.11 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు హైదరాబాద్ లో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం డీడీని అందజేశారు.

## ప్రత్యేక పారిశుద్ధ్యానికి ఆపరేషన్ క్లీన్ స్వీప్

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్**

**- స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమం ఆపరేషన్ క్లీన్ స్వీప్- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**తిరుపతి, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు మేరకు చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో భాగంగా తిరుపతిలో పారిశుద్ధ్యానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు.సోమవారం ఉదయం స్థానిక తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్.ఎస్. నగర్ 22వ డివిజన్లో తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు తిరుపతి మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ శారదా దేవి లతో కలసి సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో ఒక నెలపాటు నాలుగు బృందాల ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరిమిత ప్రాంతాలను ఎంపిక చేసి ఇంటెన్సివ్ మోడ్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారం చేయడం ఆపరేషన్ క్లీన్ స్వీప్ లక్ష్యం అని వివరించారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో సుమారు 25 కిలోమీటర్ల స్టార్మ్ వాటర్ డ్రైన్స్, 65 కిలోమీటర్లకు పైగా ప్రధాన కాలువలు ఉన్నాయని, వీటిలో చెత్త పేరుకుపోవడం వల్ల వర్షాకాలంలో నీటి నిల్వలు, వరద సమస్యలు తలెత్తే అవకాశముందని తెలిపారు.డ్రైనేజీలు మూసుకుపోవడం వల్ల డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికున్గున్యా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, అలాగే దుర్వాసనలు, కాలనీల్లోకి నీరు చేరడం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తాయని చెప్పారు. ఈ నేపథ్యంలో డ్రైనేజీలను పూర్తిగా శుభ్రపరచడంతో పాటు అవసరమైన మరమ్మతులు కూడా చేపడుతున్నామని వెల్లడించారు.గత వారం ఒక బృందం ద్వారా కార్యక్రమాన్ని నిర్వహించగా, రాబోయే రెండు



వారాల్లో మిగిలిన ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ద్వారా పనులు కొనసాగుతాయని తెలిపారు. అయితే పరిశుభ్రత కార్యక్రమం కేవలం కార్పొరేషన్ బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత అవసరమని అన్నారు. ప్రతి ఇంటిలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని, చెత్త వర్గీకరణను 100 శాతం అమలు చేయాలని కోరారు. చెత్తను వేరు చేయకుండా ఇస్తే తిరిగి భారీ చెత్త కుప్పలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. గత రెండు సంవత్సరాల్లో అన్ని మున్సిపాలిటీల పరిధిలోని లెగసీ డంపులను తొలగించామని, ఆ విజయాన్ని కొనసాగించేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్లో భాగంగా నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్లో గత ఏడాది తిరుపతి కార్పొరేషన్ దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక అవార్డును సాధించిందని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సమిష్టి కృషి వల్లే ఈ గౌరవం లభించిందని, ఈ ఏడాది కూడా ఉత్తమ స్థానాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ సుమారు రెండు లక్షల మంది ఫ్లోటింగ్ జనాభా తిరుపతికి వస్తున్నప్పటికీ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. శ్రీవారి పాదాల చెంత ఉన్న తిరుపతిని దేశంలోనే ఆదర్శవంతమైన, పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొని పరిసరాల పరిశుభ్రతకు సహకరించడం అభినందనీయమన్నారు. స్థానిక శాశనసభ్యులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగరంలోని మురుగు కాలువలు, స్టార్మ్ వాటర్ డ్రైన్ల ప్రక్షాళన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, ఎన్డీఏ కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, స్థానిక కాలనీ వాసులతో కలిసి నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమం మొదటి వారంలో లక్ష్మీపురం జంక్షన్ చేపల మార్కెట్ పరిసరాల్లో నిర్వహించామని, రెండో వారంలో నగరంలోని కాలువలు, నాలాలు, చెత్తతో బ్లాక్ అయిన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక శుభ్రత చర్యలు చేపడుతున్నామని చెప్పారు. వర్షాకాలంలో నీరు నిల్వ కాకుండా, కాలుష్యం వ్యాపించకుండా స్టార్మ్ వాటర్ డ్రైన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా తొలగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు వెయ్యి మంది మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొని నగర వ్యాప్తంగా పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. నెల రోజులపాటు కొనసాగే ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో జరుగుతోందని అన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి వారం ఒక రోజు ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం నిర్వహిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు కూడా పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములై నగర అభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తిరుపతి తిరుమల దేవస్థానం బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్ చైర్పర్సన్ సుగుణమ్మ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సరాశివం, సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులు, కార్మికులు ఎన్ సి సి విద్యార్థులు పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**- ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**




**తిరుపతి,జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యతనిస్తున్నామని ఆ సంస్థ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి' కార్యక్రమానికి 57 వినతులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పలువురు వినియోగదారులు విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే ఏర్పాటు చేసిన 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఏపీఎస్పీడీసీఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఉ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్ డి) కే. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, ఎం. ఉమాపతి, కే. సంపత్ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు సురేంద్ర రావు, చక్రపాణి, జగదీష్, భాస్కర్ రెడ్డి, లత, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

**తిరుపతి, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని సాయి సుధా ప్లే స్కూల్ ఏపీ క్యాంపస్ ను సోమవారం స్కూల్ ఎండి డాక్టర్ రేఖ రాళ్లపల్లి యు.ఎస్. ఏ, గుడివాడ వెంకట రామానాయుడు, అధ్యక్షులు రామ్ సాఫ్ట్వేర్ సిస్టం ఐ .ఎన్. సి. యూఎస్ఏ, డాక్టర్ వైష్ణవి రాళ్లపల్లి ఎండి యు .ఎస్. ఏ, డాక్టర్ బద్దెల సుకుమార్, డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి, మాస్టర్ అభిషేక్ లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంతో సాయి సుధా ప్లే స్కూల్ ఏపీ క్యాంపస్ ను ప్రారంభించడం జరిగిందని తెలియజేశారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అభ్యసించడం ఎంతో అవసరన్నారు. గ్రామీణ ప్రాంతంలో కూడా నగరాలకు ఏమాత్రం తీసుకొని విద్యా ప్రమాణాలు అందుబాటులోకి రావడం చాలా అభినందనీయమని పేర్కొన్నారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని పోటీ ప్రపంచానికి తగినట్లుగా విద్యా ప్రమాణాలు అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని లక్ష్యంతో యుద్ధ సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణులుగా కాకుండా సమాజానికి ఉపయోగపడే బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం తో కూడిన విద్య సృజనాత్మక కు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్లే స్కూల్ ఇన్చార్జి భార్గవి, రేవతి మాట్లాడుతూ విద్యార్థుల మేధో వికాసం పై కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనుభవిగ్యులైన ఉపాధ్యాయులతో పాటు ఆధునిక తరగతి గదులు స్మార్ట్ లెర్నింగ్ సదుపాయాలు క్రీడా వసతులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో ప్రాంతీయ విద్య అభివృద్ధికి ఒక కేంద్రంగా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ, పుష్ప, భార్గవి, ఆసిఫా, శకుంతల, శారద, సుజాత, మహేశ్వరి, ధనలక్ష్మి దాక్షాయని, కిరణ్, మున్వర్ భాష, వెంకట ముని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెన్షన్లను అందజేసిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆరణి



**తిరుపతి, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం సామాజిక భద్రత కల్పిస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు.సోమవారం ఉదయం తిరుపతి పట్టణంలోని ముత్యాలరెడ్డి పల్లిలో గల దుర్గా నగర్లో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో కలిసి పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.., సామాజిక భద్రత కల్పించే ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత కలిగిన సంక్షేమ పథకాలలో ఒకటిగా నిలిచిందన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్లో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా, పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఒక్క జిల్లాకే నెలకు సుమారు రూ.120 కోట్ల మేర పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇది దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమాలలో ఒకటని పేర్కొన్నారు.జూన్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పెన్షన్ సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి మరియు ఉపముఖ్యమంత్రి నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో సామాజిక భద్రతా పెన్షన్లను రూ.3,000 నుండి రూ.4,000కు పెంచినట్లు తెలిపారు.తిరుపతి నియోజకవర్గంలో 18,303 మంది లబ్ధిదారులకు వివిధ కేటగిరీల కింద ప్రతి నెలా రూ.8 కోట్ల 19 లక్షల మేర పెన్షన్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన ఉదయం నుంచే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందించడం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అత్యంత ప్రజాదరణ పొందిన కార్యక్రమమని అన్నారు.లబ్ధిదారులందరూ ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అదనపు ఖర్చులు లేకుండా ఇంటి వద్దకే పెన్షన్లు అందుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో క్లీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, మున్సిపల్ ఇంచార్జీ కమిషనర్ శారదా దేవి, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027